టీచర్లకు అందని జీతాలు

- పలు శాఖల ఉద్యోగులకు కూడా...
- పింఛన్‌దారులదీ అదే పరిస్థితి
- ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే కారణం

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొన్ని శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు, రిటైర్డు ఉద్యోగులకు పింఛన్లు ఇవ్వడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేలోగా పాలనా వ్యవహారాలు చూడాల్సినవారు ఎందుచేతనో నిర్లిప్తంగా ఉండిపోయారు. దాంతో ఆరో తేదీ వచ్చినా పలు శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు, రిటైర్డు ఉద్యోగ/ఉపాధ్యాయులకు పింఛన్లు అందలేదు. ఉపాధ్యాయ, ఉద్యోగుల జీతాల బిల్లులు గత నెల సకాలంలోనే అప్‌లోడ్ చేశారు. రెవెన్యూ, ట్రెజరీతోపాటు కొన్ని శాఖలకు ఈ నెల ఒకటో తేదీ తరువాత జీతాలు అందాయి. మిగిలిన శాఖల ఉద్యోగులంతా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. గత మూడేళ్ల నుంచి జీతాలు, పింఛన్లు సక్రమంగా అందడం లేదు. విడతల వారీగా పదో తేదీన, అప్పుడప్పుడు 15వ తేదీ వరకు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండేవి. అయితే ఈ నెల నాలుగో తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం జీతాలు, పింఛన్ల గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాతే జీతాలు వస్తాయనే ప్రచారం జరుగుతోంది. సాధారణంగా జూన్ నెలలో ఖర్చు అధికంగా ఉంటుంది. పిల్లల ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్ వంటి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అటువంటిది ఇప్పటివరకూ జీతాలు రాకపోతే పిల్లలను పాఠశాలలు/కళాశాలల్లో ఎలా చేర్పిస్తామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్ ప్రశ్నించారు. జీతాలు, పింఛన్ల పంపిణీ ఆలస్యం కావడానికి ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. టీచర్లు, ఉద్యోగులు ప్రభుత్వానికి వైసీపీకి వ్యతిరేకంగా ఓటేశారన్న కారణంతో ప్రభుత్వంలో ఉన్నతాధికారులు జీతాల విషయం పట్టించుకోలేదని ఎస్టీయూ అధ్యక్షులు ఈ.పైడిరాజు ఆరోపించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరేలోగా జీతాలు, పింఛన్లు అందేలా చొరవ తీసుకోవాలని కోరారు.

కూటమి విజయంపై ఏయూలో సంబరాలు

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

అనంతరం కేక్ కటింగ్

వీసీ ప్రసాదరెడ్డిని తక్షణమే తొలగించాలని డిమాండ్

... మెయిన్‌లో

...అంతా ఆయనే చేశారు

జగన్ వ్యవహారశైలే కొంపముంచింది

ఓటమిపై అంతరంగిక సంభాషణల్లో వైసీపీ అభ్యర్థులు, నేతల ఆక్రోశం

- వార్డు/గ్రామ సచివాలయాలు, వలంటీర్ల పేరుతో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు ప్రజలతో సంబంధాలు లేకుండా చేశారు
- ఐదేళ్లలో ఎలాంటి ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో యువత, నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- క్రమబద్ధీకరణకు సవాలక్ష ఆంక్షలతో సచివాలయ ఉద్యోగుల్లోనూ అసంతృప్తి
- ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించడం పార్టీ ఓటమికి మరో కారణం
- నాసిరకం మద్యం తాగినవారు అనారోగ్యం పాలవ్వడంతో వారి కుటుంబ సభ్యుల్లో వైసీపీపై ఆగ్రహం
- బటన్ నొక్కితే చాలు... అదే పరిపాలన అనుకున్నారు
- ఐదేళ్లలో సీఎంగా ప్రజల్లో తిరగకపోవడం, ప్రజా ప్రతినిధులకు కలిసే అవకాశం ఇవ్వకపోవడం, ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెత్తు పోకడలే దారుణ పరాజయానికి కారణం
- ఎన్నికల్లో ఎంత డబ్బు పెట్టినా ఉపయోగం లేకుండా పోయిందని సన్నిహితుల వద్ద ఆవేదన



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"ఐదేళ్లలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించాం. డీబీటీ పేరుతో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశాం. వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువచేశాం. వార్డు వలంటీర్ల ద్వారా ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను చేరవేశాం. ఇంతకంటే ఇంకేం చేయాలి. ప్రజలంతా మాకే ఓటేస్తారు. మా గెలుపు ఖాయం. మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకుంటాం"...అంటూ బీరాలు పలికిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, నేతలు మంగళవారం వెలువడిన ఫలితాలను చూసి కంగుతిన్నారు. ఘోర పరాజయానికి గల కారణాలను తమ సన్నిహితులతో పంచుకుంటున్నారు.

గడచిన (2019) ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో 11 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకుంది. నగరంలోని తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ నియోజక వర్గాల్లో టీడీపీ అభ్యర్థులు గెలిచినప్పటికీ కొద్ది రోజులకే దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వైసీపీ పంచన చేరిపోయారు. అయితే ఈసారి జరిగిన ఎన్నికల్లో ఏజెన్సీ పరిధిలోని అరకులోయ, పాడేరు మినహా మిగిలిన 13 నియోజకవర్గాల్లో కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) అభ్యర్థులు ఘన విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థులు భారీ తేడాతో ఓటమి పాలయ్యారు. అందుకు గల కారణాలను వారు ఇప్పుడు విశ్లేషించుకుంటున్నారు. తాజా ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల కంటే

... మిగతా 6వ పేజీలో

వలంటీర్లతోనే భారీ నష్టం

ఆ వ్యవస్థ వల్ల ప్రజలకు, నాయకులకు మధ్య సంబంధాల్లేకుండా పోయాయి

పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు దక్కలేదు

- ఎమ్మెల్యేలకు సీఎం అపాయింట్‌మెంట్ దొరికేది కాదు
- ఓటమిపై గొంతు విప్పుతున్న వైసీపీ నేతలు



కరణం ధర్మశ్రీ



గుడివాడ అమర్



కేకే రాజు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ నాయకులు ఘోరమైన ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు. రూ.2.5 లక్షల కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అందుకున్న కోట్లాది మంది అక్కచెల్లెళ్లు, అవ్వతాతల ఓట్లు ఏమైపోయాయో?... అని ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించగా... విశాఖ నాయకులు మాత్రం ఈ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని మనసులో మాట బయట పెడుతున్నారు.

ఏనాడూ తమ అభిప్రాయాలు తెలుసుకోలేదని, క్షేత్రస్థాయిలో జరుగుతున్నది చెప్పడానికి యత్నిస్తే...కనీసం కలిసే అవకాశం కూడా సీఎం కోటరీ ఇవ్వలేదని ఎమ్మెల్యే స్థాయి నాయకులే ఆరోపిస్తున్నారు. ఓడిపోయిన నేతలు ఒక్కొక్కరు మీడియా ముందుకువస్తున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రెండుసార్లు పోటీ చేసిన ఓడిపోయిన కేకే రాజు నిన్నగాక మొన్న విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి...వలంటీర్ల వ్యవస్థే వైసీపీ కొంప ముంచిందని ఆరోపించారు. దాని వల్ల కార్యకర్తలకు గుర్తింపు లేకుండా పోయిందని విమర్శించారు. నాయకులకు, ప్రజలకు మధ్య వారధిగా ఉండే కార్యకర్తల స్థానంలో వలంటీర్లు రావడం వల్ల జనం ఏ అవసరం వచ్చినా వారి దగ్గరకే వెళ్లారని, దాంతో నాయకులతో సంబంధాలు బలపడలేదన్నారు.

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విశాఖలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ వల్ల పార్టీ కార్యకర్తలకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. పార్టీకి పునాదుల్లాంటి కార్యకర్తలు ఈ ఎన్నికల్లో మనస్ఫూర్తిగా పనిచేయలేకపోయారన్నారు. అన్నింటికీ వలంటీర్ల వ్యవస్థపై ఆధారపడడం, వారికే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఎంతో నష్టం జరిగిందన్నారు. మూడు రాజధానుల అంశం ప్రస్తావిస్తూ, విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తామని, ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు దానికి రిఫరెండంగా తీసుకుంటామని చెప్పామన్నారు. ప్రజలు దీనిని హర్షించలేదని అర్థమైందని పరోక్షంగా అంగీకరించారు. ఇది కూడా పార్టీకి పెద్ద నష్టమే కలిగించినదన్నట్టుగా మాట్లాడారు.

చోడవరం నుంచి పోటీ చేసి ఓడిపోయిన కరణం ధర్మశ్రీ చోడవరంలో గురువారం మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ వల్ల పార్టీకి ఎటువంటి ప్రయోజనం కలగలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. వారు పింఛన్లు పంపిణీకి ఉపయోగపడ్డారు తప్పితే ఇంకేమి చేశారని ప్రశ్నించారు. పార్టీని ఒక ప్రైవేటు కంపెనీలా ఐ ప్యాక్ బృందంతో నడిపించారని, అదే కొంప ముంచిందన్నారు. తప్పులు జరుగుతున్నాయని చెబితే కొందరు నాయకులు

... మిగతా 6వ పేజీలో

కలిసి మెలిసి పని చేసుకుందాం...

టీడీపీ కార్పొరేటర్లకు వైసీపీ పాలకవర్గం పెద్దల ప్రతిపాదన

- డిప్యూటీ మేయర్ పదవితోపాటు స్టాండింగ్ కమిటీలో నలుగురికి అవకాశం ఇస్తామని ఆఫర్
- టీడీపీలో చేరేందుకు పలువురు వైసీపీ కార్పొరేటర్లు సిద్ధం
- జీవీఎంసీ పాలకవర్గం నేతలు, కార్పొరేటర్లలో గుబులు
- మేయర్ పీఠాన్ని కాపాడుకునేందుకు యత్నాలు





(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'కార్పొరేషన్‌లో అందరం కలిసి పనిచేసుకుందాం... మేయర్‌ను మార్చేందుకు ప్రయత్నాలు చెయ్యొద్దు. మునిసిపల్ చట్టం ప్రకారం నాలుగేళ్ల పదవీకాలం పూర్తయ్యేంత వరకూ అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం లేదు కాబట్టి కాస్త ఆలోచించండి.'

- ఇదీ జీవీఎంసీ పాలకవర్గంలోని పెద్దలు ఇద్దరూ టీడీపీలోని ముఖ్య కార్పొరేటర్లకు చేసిన ప్రతిపాదన.

...ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయాన్ని సాధించింది. వైసీపీ కేవలం 11 ఎమ్మెల్యే స్థానాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో పలువురు వైసీపీ కార్పొరేటర్లు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వైసీపీలో ఉండడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని టీడీపీలో చేరాలని భావిస్తున్నారు.

జీవీఎంసీకి 2021 మార్చిలో ఎన్నికలు జరిగాయి. వైసీపీ 59 వార్డులను గెలుచుకోగా, టీడీపీ 30, జనసేన మూడు, సీపీఐ, సీపీఎం, బీజేపీ నుంచి ఒక్కొక్కరు, ఇండిపెండెంట్లు నలుగురు కార్పొరేటర్లుగా ఎన్నికయ్యారు. తర్వాత జరిగిన పరిణామాల్లో ముగ్గురు టీడీపీ కార్పొరేటర్లు వైసీపీకి మద్దతు ప్రకటించగా, ఇండిపెండెంట్లుగా గెలిచిన ఇద్దరు జనసేనలో చేరారు. ఇదిలావుండగా నగర పాలక సంస్థల్లో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కనీసం నాలుగేళ్ల పదవీ కాలం పూర్తికావాలని, అదేవిధంగా జోన్ల వారీగా కాకుండా కార్పొరేటర్లు అందరూ కలిసి స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకునేలా మునిసిపల్ చట్టాన్ని మార్చుతూ వైసీపీ ప్రభుత్వం గెజిట్ జారీచేసింది. అయితే ఇటీవల ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో వైసీపీ కార్పొరేటర్లు పలువురు టీడీపీ, జనసేనల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు నగర పాలక సంస్థలు, మునిసిపాలిటీల్లో కూడా వలసలు ఉండే అవకాశం ఉంది. ఇటువంటి తరుణంలో

... మిగతా 6వ పేజీలో

జిల్లాలో 118 మందికి డిపాజిట్ గల్లంతు

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలు పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు డిపాజిట్లు కోల్పోయారు. విశాఖ జిల్లాలో ఒక పార్లమెంటుకు 33 మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 101 మంది పోటీ చేశారు. మొత్తం 134 మంది బరిలో ఉన్నారు. వీరిలో 16 మంది తప్ప మిగిలిన 118 మంది డిపాజిట్ కోల్పోయారు. పార్లమెంటు, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. ఆయా స్థానాల్లో వైసీపీకి చెందిన ఎనిమిది మంది అభ్యర్థులకు డిపాజిట్‌కు తగినన్ని ఓట్లు రాగా మిగిలిన 118 మంది ధరావత్తు కోల్పోయారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గానికి పోటీ చేసిన 33 మందిలో 31 మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసిన 101 మందిలో 87 మందికి డిపాజిట్ గల్లంతైంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చెల్లిన ఓట్లలో 1/6 వంతు వస్తేనే డిపాజిట్ వెనక్కి ఇస్తారు. ఈ లెక్కన జిల్లాలో 118 మందికి డిపాజిట్ రాలేదు.

ఆర్డీ కార్యాలయంలో అడ్డగోలు వ్యవహారం

- కోడ్ ఉండగా స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి సిద్ధం
- కలెక్టర్‌కు పలువురు అభ్యర్థులు ఫిర్యాదు
- కాబోయే సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి కూడా..
- ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలు.. నిలిచిన కౌన్సెలింగ్

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో అడ్డగోలుగా స్టాఫ్‌నర్సు పోస్టులు భర్తీ చేసేందుకు గురువారం అధికారులు యత్నించడం వివాదాస్పదమైంది. అది కూడా కేజీహెచ్‌తోపాటు

... మిగతా 6వ పేజీలో

దొడ్డిదారి బదిలీలకు బ్రేక్



- ఉమ్మడి జిల్లాలో 69 మంది టీచర్లకు షాక్
- నగర పరిసరాల్లో పోస్టింగ్ కోసం ఎన్నికల ముందు వైసీపీ నేతలకు రూ.లక్షలు సమర్పించుకున్న ఉపాధ్యాయులు
- అప్పట్లో ఎక్కడా ఖాళీలు లేకపోవడంతో జూన్ నుంచి పోస్టింగ్స్ ఇవ్వాల్సిందిగా ముందస్తు ఉత్తర్వులు
- ఇప్పుడు ప్రభుత్వం మారడంతో వాటిని రద్దు చేస్తూ పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలు

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు విద్యా శాఖ చేపట్టిన దొడ్డిదారి బదిలీలకు ఉన్నతాధికారులు చెక్ పెట్టారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు జారీచేసిన మొత్తం ఎనిమిది ప్రొసీడింగ్స్‌ను రద్దు చేస్తూ పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల అనంతరం...అంటే జూన్ తరువాత బదిలీ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని ఇచ్చిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోవద్దని డీఈవోలకు కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 69 మంది ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులు రద్దయ్యాయి. దీంతో బదిలీల కోసం సగటున నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు ముడుపులు ఇచ్చిన ఉపాధ్యాయులు లబోదిబోమంటున్నారు.

ఉపాధ్యాయుల అక్రమ బదిలీల వ్యవహారంలో ఉత్తరాంధ్రకు చెందిన కీలక వ్యక్తి, ఆయన సహాయకుడు సొమ్ములు వసూలు చేశారని ఉపాధ్యాయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత టీచర్ల బదిలీల విషయంలో అనేకసార్లు సాక్షాత్తూ సీఎం పేషీ, మంత్రులు అడ్డగోలుగా వ్యవహరించారు. కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే బదిలీలు చేపట్టాల్సి ఉండగా, అస్మదీయులైన వ్యక్తుల ద్వారా వచ్చిన టీచర్లను ప్రభుత్వ ఉత్తర్వుల పేరిట కోరుకున్నచోట పోస్టింగ్ ఇచ్చారు. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. ఓ కీలక నేత, ఆయన కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సహాయకుడు...ఎవరికి వారు సొంతంగా కౌంటర్లు పెట్టి వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. బదిలీల కోసం నగరంలోని రైల్వేన్యూకాలనీలో ఉంటున్న అధికార పార్టీ నేత వ్యక్తిగత సహాయకుడి ఇంటికి టీచర్లు భారీగా క్యూకట్టేవారు. నగర పరిసరాల్లో పోస్టింగ్ కోసం అడిగినంత ఇచ్చేవారు. కొందరు నగర పరిసరాల్లో ఒక స్కూలు నుంచి మరో స్కూలుకు బదిలీ కోసం రూ.లక్షలు పోశారు. విశాఖ పరిసరాల్లో పోస్టింగ్ కోసం పోటీ పెరగడంతో రేటు పెంచేసి కొందరి వద్ద ఆరు లక్షల నుంచి ఎనిమిది లక్షల రూపాయల వరకూ తీసుకున్నారు.

ప్రభుత్వ పెద్దలు నగర పరిసరాలు, శివారు ప్రాంతాల్లో ఖాళీలు లేకపోయినా

... మిగతా 6వ పేజీలో

బీచ్‌రోడ్డులో యువకుడి హల్‌చల్ - వార్త I పేజీలో

కాంగ్రెస్‌కు 1.93% ఓట్లు

- ఉమ్మడి జిల్లాలో 13 అసెంబ్లీ సెగ్మెంట్లలో పోటీ
- 44,699 ఓట్లు రాక
- అరకులోయలో అత్యధికంగా 6.99 శాతం ఓట్లు
- గత ఎన్నికల్లో 30,938 ఓట్లు... 1.2 శాతం

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గతంలో పోల్చితే ఓటింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు స్వీకరించడమే ఇందుకు కారణమని చెప్పవచ్చు. అయితే కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం నోటా కంటే తక్కువ ఓట్లు రావడం గమనార్హం. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 15 నియోజక వర్గాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 30,938 ఓట్లు (1.2 శాతం) దక్కించుకున్నారు. తాజా ఎన్నికల్లో పొత్తులో భాగంగా రెండు స్థానాలను కమ్యూనిస్ట్ పార్టీలకు కేటాయించగా, 13 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసింది. ఆయా స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులు 44,699 ఓట్లు (1.93 శాతం) తెచ్చుకున్నారు.

అరకులోయలో పార్టీ తరఫున పోటీ చేసిన శెట్టి గంగధరస్వామి 6.99 శాతం ఓట్లను సాధించారు. 12,503 ఓట్లు దక్కించుకున్న గంగాధరస్వామి నియోజక వర్గంలో ఐదో స్థానంలో నిలిచారు. మాడుగుల నియోజకవర్గంలో బొడ్డు శ్రీనివాస్‌కు 1,784 ఓట్లు (1.08 శాతం) మాత్రమే వచ్చాయి. ఆయన కంటే నోటాకు (4,070) ఎక్కువ ఓట్లు లభించాయి. నర్సీపట్నంలో రుత్తల శ్రీరామ్మూర్తికి 1,088 ఓట్లు (0.59 శాతం) రాగా, నోటాకు 3,824 ఓట్లు (2.09 శాతం) పడ్డాయి. చోడవరంలో జగత శ్రీనివాసరావుకు 2,527 ఓట్లు (1.36 శాతం), పాయకరావుపేట నియోజకవర్గంలో డాక్టర్ బోతి తాతారావుకు 2,087 ఓట్లు (1.01 శాతం), ఎలమంచిలి నియోజకవర్గంలో అనంత రామనరసింగరావు టంకాలకు 1,822 ఓట్లు (1.02 శాతం) వచ్చాయి. అలాగే అనకాపల్లిలో ఐఆర్ గంగాధర్‌కు 1,895 ఓట్లు (1.1 శాతం), పెందుర్తిలో పిరిడి భగత్‌కు 4,224 ఓట్లు (1.84 శాతం), విశాఖపట్నం తూర్పులో గుత్తుల శ్రీనివాసరావుకు 3,430 ఓట్లు (1.69 శాతం), ఉత్తర నియోజకవర్గంలో లక్కరాజు రామారావుకు 4,252 ఓట్లు (2.26 శాతం), దక్షిణ నియోజకవర్గంలో వాసుపల్లి సంతోష్‌కుమార్‌కు 3,940 ఓట్లు (2.83 శాతం) వచ్చాయి. చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, పెందుర్తి, ఎలమంచిలి నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు పడ్డాయి. ఇక అనకాపల్లి పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన వేగి వెంకటేష్‌కు 24,833 ఓట్లు (1.94 శాతం), విశాఖ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన పి.సత్యారెడ్డికి 30,267 ఓట్లు (2.18 శాతం) వచ్చాయి.


టీడీపీ కార్యాలయంలో సంబరాలు జరుపుకుంటున్న తెలుగు మహిళలు


సీతారామాంజనేయ ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న నేతలు

టీడీపీ కార్యాలయంలో తెలుగు మహిళల సంబరాలు

మహారాణిపేట, జూన్ 6: రాష్ట్రంలో కూటమికి అఖండ విజయం లభించడంతో గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహిళలు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ముందుగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని వేడుకలు జరిపారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు తెలుగు మహిళల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి ఈతలపాక సుజాత, జిల్లా కార్యదర్శి గణగళ్ల సత్యవతి, రమాదేవి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన సందర్భంగా గురువారం శ్రీ ఉమా రామలింగేశ్వర కోదండ సీతారామాంజనేయస్వామి ఆలయంలో తెలుగుదేశం పార్టీ అభిమానులు 108 కొబ్బరి కాయలు కొట్టి, ప్రత్యేక పూజలు చేశారు. శెట్టిబలిజ సంఘం రామాలయం ప్రాంగణంలో బత్తిన దంతేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో రామరాజ్యం రావడం, దుష్ట పరిపాలన అంతం కావడంతో మొక్కు తీర్చుకున్నామన్నారు. ప్రజారంజక పాలనతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖ శాంతులు కలగాలని కోరుతూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. అనంతరం మిఠాయిలు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన బండారు


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, జూన్ 6 : మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం విజేత బండారు సత్యనారాయణ మూర్తి గురువారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అధినేత చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చంద్రబాబుతో కొద్దిసేపు ముచ్చటించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిని కలిసిన విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జూన్ 6: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని ఉత్తర నియోజకవర్గం విజేత విష్ణుకుమార్ రాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి పరశురామ్‌రాజు, ఉత్తర ఇన్‌చార్జి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


పురందేశ్వరితో విష్ణుకుమార్‌రాజు, తదితరులు


విష్ణుకుమార్‌రాజును అభినందిస్తున్న విమాన ప్రయాణికుల సంఘం సభ్యులు

విమాన ప్రయాణికుల సంఘం అభినందనలు

విశాఖపట్నం: ఉత్తర నియోజకవర్గం నుంచి గెలుపొందిన విష్ణుకుమార్ రాజును ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు నరేష్‌కుమార్, కుమార్ రాజా, డీఎస్ వర్మ, కాశీవిశ్వనాథరాజు అభినందించారు. మంత్రి పదవి రావాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జూన్ 6: మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బి.సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార హిల్ వ్యూ పార్క్, రాకెట్ పార్క్, ఏఎస్ఆర్‌నగర్, వోల్వో ఆఫీస్, సబ్బంహరి గృహం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.

26, 44 వార్డుల్లో బీజేపీకి మెజారిటీ

అక్కయ్యపాలెం, జూన్ 6: ఉత్తర నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ 26, 44 వార్డుల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి విషుకుమార్‌రాజుకు మెజారిటీ లభించింది. 26వ వార్డులో 22 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 18,501 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 11,688 మంది ఓట్లు వేశారు. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు 7,426 మంది ఓట్లు వేయగా వైసీపీ అభ్యర్థి కేకే రాజుకు 3,120 మంది ఓటు వేశారు. మిగిలిన ఓట్లు ఇతర పార్టీల అభ్యర్థులకు, నోటాకు పడ్డాయి. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు 4,306 ఓట్లు మెజారిటీ లభించింది. కాగా 44వ వార్డులో 17 పోలింగ్ బూతులు ఉన్నాయి. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు 5,910 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి కేకే రాజుకు 3,735 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు 2,345 ఓట్లు మెజార్టీ వచ్చింది.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అక్కయ్యపాలెం, జూన్ 6: గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని షిర్డీ సాయిధ్యానమందిరంలో గురువారం ఓమ్ని హాస్పిటల్స్, గిగ్గిల్స్ బై ఓమ్ని ఆర్కే హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. భక్తులు, ఆలయ సిబ్బంది పరీక్షలు చేయించుకున్నారు. వేసవిలో వచ్చే వ్యాధులను దృష్టిలో పెట్టుకొని అందరికీ ఆరోగ్యం, గొప్ప జీవన శైలిని అందించాలనే ఉద్దేశంతో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు హాస్పిటల్స్ యాజమాన్యం తెలిపింది. వాసన్ ఐ కేర్ ఆస్పత్రి సిబ్బంది ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, రాంబాబు, సభ్యులు, వైద్య సిబ్బంది గౌరినాయుడు, చంటి, భాగ్యశ్రీ, డాక్టర్ షణ్ముఖ్, నవీన్, రమ్య పాల్గొన్నారు.

వయోజనులకు టీబీ వ్యాక్సిన్


బురుజుపేటలో వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

పూర్ణామార్కెట్, జూన్ 6: క్షయ నిర్మూలనకు వీలుగా నగరంలో 60 ఏళ్లు వయసు దాటిన వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నారు. ఇందులో భాగంగా బురుజుపేట ఆయుష్మాన్ డిస్పెన్సరీలో ఆరోగ్య సిబ్బంది గురువారం పలువురికి టీకాను వేశారు. దీనిపై ముందుగా ప్రచారం చేపట్టిన సిబ్బంది కేంద్రాలకు వచ్చిన వయోజనులకు టీకాలను వేశారు. వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, ఎవరెవరికి వ్యాక్సిన్ వేస్తారో ఎన్‌హెచ్ఓ డి.నాగలక్ష్మి వివరించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రతి గురు, సోమవారాల్లో ఉచితంగా టీకా వేస్తామన్నారు.

'నిబద్ధత గల నేత చంద్ర రాజేశ్వరరావు'


రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి, నేతలు

అల్లిపురం, జూన్ 6: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ నాయకుడు చంద్ర రాజేశ్వరరావు నిబద్ధతగల నేత అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. సీఆర్ 110వ జయంతి సందర్భంగా గురువారం అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. కమ్యూనిస్టు దృక్పథంతో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్లినందుకు సోవియట్ యూనియన్ ఆర్డర్ ఆఫ్ లెనిన్, బల్గేరియా ఆర్డర్ ఆఫ్ డెమిట్రోప్ అవార్డు, చెకోస్లోవేకియా, మంగోలియా వంటి దేశాలు పలు అవార్డులతో సత్కరించాయన్నారు. నేటి కమ్యూనిస్టులకు సీఆర్ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎస్‌కె రహమాన్, ఎం.మన్మథరావు, జి.కాసులరెడ్డి, ఆదారి ఆదినారాయణ, వై.రామారావు తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరుచేయాలి : యూటీఎఫ్


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నేతలు

మహారాణిపేట, జూన్ 6: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో కె.మోహన్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్, కోశాధికారి కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం


శిక్షణ పొందిన చిన్నారులతో నిర్వాహకులు

కంచరపాలెం, జూన్ 6: జీవీఎంసీ 56వ వార్డు ఆర్పీపేట మహాత్మా గాంధీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గం చిన్నారులకు నెలరోజులు పాటు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో ముగిసింది. ఈ మేరకు గురువారం చిన్నారులకు బహుమతుల ప్రదానం జరిగింది. ఆటల పోటీలతో పాటు వైజ్ఞానిక అంశాలపై శిక్షణను అందించారు. ముగింపు సందర్భంగా చిన్నారులకు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డి.గోవిందరాజు, కె.వెంకటరావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కూన రవిని కలిసిన సనపల వరప్రసాద్


కూన రవికి శుభాకాంక్షలు చెబుతున్న సనపల, తదితరులు

మురళీనగర్, జూన్ 6: శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నుంచి విజయం సాధించిన కూన రవికుమార్‌ను విశాఖ టీడీపీ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్, తదితరులు గురువారం శ్రీకాకుళంలోని ఆయన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న రోజుల్లో ఉన్నత పదవులు అలంకరించాలని కోరుతూ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సనపల నరసింహస్వామి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ వారోత్సవాలు

విశాఖపట్నం, జూన్ 6: వాల్తేరు డివిజన్‌లో అంతర్జాతీయ రైల్వే లెవెల్ క్రాసింగ్ అవగాహన వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రైల్వే ట్రాక్‌ను దాటే సమయంలో పాటించాల్సిన భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీరింగ్, భద్రతా విభాగం, సివిల్ డిఫెన్స్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డివిజన్ పరిధిలోని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నామని, ప్రతి చోట బ్యానర్లు, పోస్టర్లను ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ సిద్దార్థ ప్రధాన్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం భద్రతా చర్యలపై సివిల్ డిఫెన్స్ సిబ్బంది నాటకం ప్రదర్శించారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఆర్ఎం, ఇతర అధికారులు

...అంతా ఆయనే చేశారు

... 5వ పేజీ తరువాయి

దీటుగా డబ్బులు ఖర్చుపెట్టినా ఘోరంగా ఓటమి పాలవ్వడం ఆశ్చర్యంగా ఉందని కొందరు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిస్థితికి సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వ్యవహారశైలే కారణమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచే వార్డు వలంటీర్లు, వార్డు/గ్రామ సచివాలయాల పేరుతో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు ప్రజలతో సంబంధాలు లేకుండా చేశారని విమర్శిస్తున్నారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నుంచి, వారికి వాటిని అందజేసే బాధ్యత వరకూ అంతా వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అప్పగించడంతో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉన్న తాము నామమాత్రంగా మారిపోయామని వాపోతున్నారు.

అలాగే గత ఐదేళ్లలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగాలు తప్పితే ఎలాంటి ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం, చివర్లో హడావుడిగా విడుదల చేసినప్పటికీ ఆచరణలో పెట్టకపోవడం వల్ల యువత, నిరుద్యోగుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత నెలకొందని అభ్యర్థులు, నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇక గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను క్రమబద్ధీకరించే విషయంలో సవాలక్ష ఆంక్షలు పెట్టడంతో వారిలో కూడా ఉద్యోగం కల్పించారనే కృతజ్ఞత పోయి, అసంతృప్తి పేరుకు పోయిందని పేర్కొంటున్నారు.

కొంపముంచిన మద్యం వ్యాపారం

తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం పాలసీని మార్చడం కూడా తాజా ఎన్నికల్లో ఓటమికి కారణంగా కొందరు అభ్యర్థులు, నేతలు విశ్లేషిస్తున్నారు. గతంలో ఉన్న ప్రైవేటు మద్యం దుకాణాలను తొలగించి, ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించడం కూడా పార్టీ ఓటమికి దారితీసిందంటున్నారు. తమ పార్టీ నేతలే కొన్ని మద్యం డిస్టిలరీలను లీజుకు తీసుకుని అక్కడ తయారయ్యే నాసిరకం మద్యాన్ని దుకాణాల్లో విక్రయించడం మొదలెట్టారని, కూలీలు, దిగువ మధ్య తరగతి ప్రజలు ఆ మద్యం తాగి అనారోగ్యం పాలవ్వడంతో వారి కుటుంబ సభ్యుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఏర్పడిందని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు మద్యం ధరలను విపరీతంగా పెంచేయడం, కావాల్సిన బ్రాండ్లు అందుబాటులో లేకుండా చేయడంతో మందుబాబులు కూడా ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. అమ్మఒడి, చేయూత, ఆసరా వంటి పథకాల విషయంలో ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉన్నప్పటికీ, నాసిరకం మద్యం సేవించి సాయంత్రం ఇంటికి చేరుకునే యజమానిని చూసి ఆ ఇంట్లోని సభ్యులంతా జగన్‌కు వ్యతిరేకంగా మారారని విశ్లేషిస్తున్నారు. సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పి మాట తప్పడం కూడా ప్రజల్లో జగన్ విశ్వసనీయతను దెబ్బతీసిందని నాయకులు అంటున్నారు. ప్రభుత్వ పనితీరుపై వివిధ వర్గాల ప్రజలు ఏమనుకుంటున్నారు...ఇంకా ఏం కోరుకుంటున్నారు?, ఎలాంటి పథకాలు, అభివృద్ధి పనులు చేయాలో నిత్యం ప్రజల్లో తిరిగే నాయకులతో కాకుండా దొడ్డిదారిన ప్యాలెస్‌లో చేరి భజన చేసేవారితో చర్చించడం, వారి సలహాలను తీసుకోవడం జగన్‌తోపాటు తమను కూడా నట్టేట ముంచేసిందని లబోదిబోమంటున్నారు. అదేవిధంగా ఐదేళ్లలో సీఎంగా ప్రజల్లో తిరగకపోవడం, ప్రజా ప్రతినిధులకు కలిసే అవకాశం ఇవ్వకపోవడం, జగన్ ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెత్తు పోకడలే 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం కావడానికి కారణమంటున్నారు. ఎంతసేపూ బటన్ నొక్కితే చాలు...అదే పరిపాలన అనుకునే భావనలో సీఎం జగన్ ఉండిపోయారని, అదే దారుణంగా దెబ్బతీసిందంటున్నారు.

వలంటీర్లతోనే భారీ నష్టం

... 5వ పేజీ తరువాయి

తనను టార్గెట్ చేశారని, క్షేత్రస్థాయిలో జరుగుతున్నది పార్టీ అధినేతకు చెబుదామనుకుంటే సీఎం పేషీ కోటరీ అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. పార్టీలో ఎవరిని కదిలించినా ఈ తరహా ఆవేదనే వ్యక్తమవుతోంది. ఇది జగన్మోహన్‌రెడ్డి చేజేతులా చేసుకున్నదేనని, ఇందులో ఎవరినీ తప్పు పట్టడానికి లేదని అంటున్నారు.

కలిసి మెలిసి పనిచేసుకుందాం...

... 5వ పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ చట్టాన్ని సవరించి నాలుగేళ్లలోపు అవిశ్వాస తీర్మానం పెట్టుకునే వెసులుబాటు కల్పిస్తే నగర మేయర్ పదవి కోల్పోయే అవకాశం ఉంది. తమ కార్పొరేటర్లు పార్టీ మారబోతున్నారనే సమాచారం తెలిసి జీవీఎంసీ పాలకవర్గంలోని వైసీపీ పెద్దలు అప్రమత్తమయ్యారు. టీడీపీలోని కీలక కార్పొరేటర్లకు ఇద్దరు నాయకులు ఫోన్ చేసి రాజీ ప్రతిపాదనలు చేస్తున్నారు. మేయర్ పదవికి ఇబ్బంది కలిగించకుండా ఉంటే డిప్యూటీ మేయర్ పదవితోపాటు స్టాండింగ్ కమిటీలో నలుగురికి స్థానం కల్పిస్తామని ప్రతిపాదించినట్టు తెలిసింది. దీనికి టీడీపీ నేతలు ససేమిరా అన్నట్టు తెలిసింది.

ఆర్జీ కార్యాలయంలో అడ్డగోలు వ్యవహారం

... 5వ పేజీ తరువాయి

ఇతర ఆస్పత్రుల్లో, విజయనగరం జిల్లాలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా ఏజెన్సీలోని మెడికల్ కాలేజీలో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అభ్యర్థులు పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలతో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారంటూ సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న చంద్రబాబునాయుడు దృష్టికి కూడా తీసుకువెళ్లారు. ఈ ప్రక్రియను నిలిపివేయాల్సిందిగా ఆయన డీఎంఈకు సూచించారు. దీంతో విశాఖలోని ఆర్జీ కార్యాలయంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా గురువారం చేపట్టాల్సిన కౌన్సెలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. దీనిపై అభ్యర్థులు ఆనందాన్ని వ్యక్తంచేశారు.

దొడ్డిదారి బదిలీలకు బ్రేక్

... 5వ పేజీ తరువాయి

భవిష్యత్తులో ఏర్పడే ఖాళీలను ముందుగానే గుర్తించి అక్కడకు పోస్టింగ్స్ ఇచ్చారు. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి బదిలీ ప్రొసీడింగ్స్ ఇవ్వడం ప్రారంభించారు. బదిలీ ఉత్తర్వులు ఇస్తున్నామని, అయితే ప్రతి నెలలో ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకుని జూన్, జూలై, ఆగస్టు నెల వరకు విధుల్లో చేరడానికి అనుమతి ఇస్తున్నామని, ఆ మేరకు డీఈవో చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. విచిత్రం ఏమిటంటే...ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత కూడా రెండు ప్రొసీడింగ్స్ ఇచ్చారంటే ఎంతకు బరితెగించారో అర్థం చేసుకోవచ్చు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 12 వరకు మొత్తం ఎనిమిది ప్రొసీడింగ్స్ మేరకు ఉమ్మడి జిల్లాలో 82 మంది టీచర్లను దొడ్డిదారిన బదిలీ చేశారు. ఉత్తర్వులు వచ్చినా నగర పరిసరాల్లో ఖాళీలు లేకపోవడంతో పలువురు డీఈవో కార్యాలయం చుట్టూ తిరిగారు. అందులో 13 మంది మాత్రం తమకున్న పలుకుబడి ఉపయోగించి ప్రతినెలా ఏర్పడే ఖాళీల్లో నియమితులయ్యారు. ఇంకా 69 మంది మిగిలిపోయారు. ఈలోగా ఎన్నికల ప్రక్రియ ఊపందుకోవడం, పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో టీచర్లకు పోస్టింగ్స్ ఇవ్వలేదు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి తెలుగుదేశం అధికారంలోకి రావడంతో అక్రమ బదిలీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఆ 69 మంది టీచర్లు షాక్‌కు గురయ్యారు. బదిలీల కోసం ఇచ్చి సొమ్ములు పోయినట్టేనని ఒక టీచర్ ఆవేదన వ్యక్తంచేశారు.

దాడి కేసులో వ్యక్తికి రెండేళ్లు జైలు

సబ్బవరం, జూన్ 6: మండలంలోని పైడివాడ అగ్రహారంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో అనకాపల్లి 12వ ఎంఎం కోర్టు నిందితుడికి రెండేళ్లు జైలు శిక్ష విధించింది. గ్రామానికి చెందిన గుండాల సంతోషి ఇంటి వద్ద 2022 మార్చి 12న వద్ద బోరు తీయించారు. తమ ఇంటిపై బురద పడుతుందని పెచ్చేటి దుర్గారావు సంతోషి తలపై రాయితో కొట్టాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో శిక్ష పడింది.

89, 91, 92 వార్డుల్లో టీడీపీ, వైసీపీ అభ్యర్థులకు నమోదైన ఓట్లు


గణబాబు


ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పి.గణబాబు సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌పై 35,184 ఓట్ల గెలు పొందారు. ఈ క్రమంలో నియోజక వర్గంలోని 89, 91, 92 వార్డుల పరిధిలో బూత్‌ల వారీగా వారికి నమోదైన ఓట్ల వివరాలిలా ఉన్నాయి.

89వ వార్డు లో కూటమి (టీడీపీ), వైసీపీ అభ్యర్థులకు ఈ విధంగా ఓట్లు పోలయ్యాయి.

బూత్	వైసీపీ	టీడీపీ	మెజార్టీ
35	275	686	411
36	230	507	277
37	218	463	245
38	257	592	335
39	255	677	422
40	242	748	506
45	161	519	358
46	165	668	503
47	239	727	488
48	232	544	312
49	197	644	447
50	290	808	518
మొత్తం 12 బూత్‌లలో మెజారిటి			4822

91వ వార్డు లో కూటమి (టీడీపీ), వైసీపీ అభ్యర్థులకు ఈ విధంగా ఓట్లు పోలయ్యాయి.

బూత్	వైసీపీ	టీడీపీ	మెజార్టీ
01	341	419	78
02	187	297	110
05	262	571	309
06	365	984	19
07	299	500	201
08	287	237	50
09	217	455	238
17	280	480	200
18	192	518	326
19	177	436	259
41	274	458	184
42	205	428	223
43	272	414	142
44	254	533	279
51	285	364	79
54	400	420	20
55	273	434	161
మొత్తం 19 బూత్‌లలో మెజారిటీ			3280

92వ వార్డు లో కూటమి (టీడీపీ), వైసీపీ అభ్యర్థులకు ఈ విధంగా ఓట్లు పోలయ్యాయి.

బూత్	వైసీపీ	టీడీపీ	మెజార్టీ
10	198	504	306
11	78	188	110
12	250	361	111
13	146	289	143
14	220	406	186
15	167	437	270
16	156	432	276
20	171	368	197
21	172	496	324
22	98	409	311
23	231	414	183
24	312	483	171
25	260	544	284
26	238	352	114
27	197	261	64
28	155	333	178
29	481	573	92
30	250	411	161
31	284	294	10
32	213	482	269
33	340	402	62
34	360	546	186
మొత్తం 22 బూత్‌లలో మెజారిటీ			4008

సినిమా గైడ్

- **సత్యభామ :** సంగం, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), శ్రీహరిపురం (ఎస్.వి.సి.లిఖిత)
- **లవ్ మౌళి :** శారద, లక్ష్మి (గాజువాక)
- **గోల్డ్ నెం.1 :** శ్రీకాంతి
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** శరత్, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, సౌజన్య (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 35, క్యాబేజీ 24, క్యారెట్ 38, దొండకాయలు 18, బంగాళదుంపలు 27, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 156, మునక్కాడలు (కిలో) 56, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 38, కీరదోస 24, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270


పల్లాకు కేక్ తినిపిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు, కోన తాతారావు, తదితరులు


పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నల్లారి సూర్యనారాయణ

గాజువాకను ప్రగతిపథంలో నడిపిస్తా

ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా..

ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూన్ 6: గాజువాకను ప్రగతిపథంలో నడిపిస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి గురువారం విచ్చేసిన ఆయనను పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీని నియోజకవర్గ వాసులు అందించారని, ఇది ప్రజల విజయమని పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిజం చేస్తానని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. వీటిలో ప్రధానమైనది స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశమని, అలాగే టోల్ గేటు తొలగింపునకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఆయన కేక్ కట్ చేశారు. బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, బొండా జగన్, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, గొర్లె వెంకునాయుడు, కోగంటి లెనిన్‌బాబు, ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, తదితరులు పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. కాగా 86వ వార్డులో టీడీపీకి అత్యధిక మెజారిటీ వచ్చేందుకు కృషి చేసిన వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణను పల్లా శ్రీనివాసరావు అభినందించారు. టీడీపీ కార్యాలయానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావడంతో ఇక్కడ సందడి వాతావరణం నెలకొంది.


పూల కిరీటం పెట్టి గజమాలతో పల్లాను సత్కరించిన అగనంపూడికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

'నల్లూరు' ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కూర్మన్నపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం పలు కాలనీల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి విజయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కీలకంగా వ్యవహరించారన్నారు. గాజువాక నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి 95,235 ఓట్ల మెజారిటీ ఎవరూ సాధించలేదని, ఆ రికార్డు టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకే దక్కిందన్నారు. విశాఖ ఎంపీగా ఎం.శ్రీభరత్ 5,04,247 ఓట్ల అత్యధిక మెజారిటీతో సాధించడం చారిత్రాత్మకమన్నారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో కన్నా 86వ వార్డులో టీడీపీకి 7,550 ఓట్ల మెజారిటీ రావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, బి.ఎల్లాజీ, లోవరాజు, ఎం.గణపతి, పి.మురళీమోహన్, నాగార్జున, జగదీశ్, తెలుగు మహిళలు నాగ సుజని, బి.శ్రీదేవి, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

పల్లాకు కలిసిన 79వ వార్డు నాయకులు

అగనంపూడి: గాజువాక నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన పల్లా శ్రీనివాసరావును పలువురు నాయకులు కలిసి అభినందించారు. 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పల్లాకు గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో పల్లా శ్రీనివాసరావు సమక్షంలో కేక్ కట్ చేశారు. వార్డు నాయకుడు ఏదూరి రాజేశ్ ఆధ్వర్యంలో పలువురు పల్లాను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కరణం జగదీశ్, బుదిరెడ్డి అప్పారావు, పైడిరాజు, అచ్యుత్, సింగి సింహాచలం, తిలక్, కె.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డు నాయకుల అభినందనలు

పెదగంట్యాడ: గాజువాక ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా శ్రీనివాసరావును టీడీపీ 75వ వార్డు సీనియర్ నాయకులు పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు వంశీకృష్ణ, నమ్మి అప్పలనాయుడు, ఎన్.అప్పారావు, ఎన్.అప్పలనాయుడు, ఎస్.అప్పారావు, ఎస్.పైడయ్య, తదితరులు ఉన్నారు.

చురుగ్గా చంద్రనగర్ అండర్‌పాస్ నిర్మాణ పనులు

గోపాలపట్నం, జూన్ 6: గత ఏడాది డిసెంబరు నెలలో నిర్మించిన చంద్రనగర్ అండర్‌పాస్‌వేలో రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. సింహాచలం రైల్వే స్టేషన్ వెనక ఉన్న చంద్రనగర్ నుంచి పాత గోపాలపట్నాన్ని కలిపే మార్గంలో అండర్‌పాస్‌వే నిర్మాణాన్ని ఆరు నెలల క్రితం చేపట్టారు. అయితే ఇప్పటివరకు అండర్‌పాస్‌వే మార్గంలో రెండు వైపులా రక్షణ గోడలతో పాటు రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరిగాయి. ప్రస్తుతం ఈ పనులు తుది దశకు చేరాయి. ఇప్పటివరకు ఆదర్శనగర్‌లోని రైల్వే గేటును దాటుకుంటూ ఈ ప్రాంతానికి భారీ వాహనాలు రాకపోకలు సాగించేవి. కాగా అండర్‌పాస్‌వే పనులు దాదాపుగా పూర్తి కావడంతో ఇక్కడి రైల్వే గేటును కూడా ఇటీవల మూసివేశారు. దీంతో కొత్తపాలెం, చంద్రనగర్ ప్రాంతాలకు నగరం నుంచి వచ్చే భారీ వాహనాలు పాత గోపాలపట్నం అండర్‌పాస్‌వే నుంచి చంద్రనగర్ అండర్‌పాస్‌వే మీదుగా గ్రామాలకు చేరుతున్నారు. మరికొద్ది రోజుల్లో అండర్‌పాస్‌వే లోపల విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు రహదారికి తుది మెరుగులు దిద్దే పనులు పూర్తి కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనకే పరిమితమైన గోపాలపట్నం ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు కార్యరూపం దాల్చకపోయినా చంద్రనగర్ అండర్‌పాస్‌వే నిర్మాణం వల్ల గోపాలపట్నం దిగువ ప్రాంతాల ప్రజలక కాస్త ఊరట లభించిందనే చెప్పాలి.


అండర్ పాస్‌వే నుంచి వస్తున్న వాహనం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, జూన్ 6: సత్తివానిపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డీవీ రమణమూర్తి గురువారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సీతారామగార్డెన్స్, తులసి గార్డెన్స్, గ్యాస్ గొడౌన్ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెందుర్తి: పెందుర్తి సబ్ స్టేషన్ పరిధి గుర్రమ్మపాలెం 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. అందువల్ల గుర్రమ్మపాలెం ఇండస్ట్రియల్ ఏరియా, సరిపల్లి, జంగాలిపాలెం, చిక్కాలిపేట, ముదపాక, గోవిందపురం, నీలకంఠపురం, అక్కిరెడ్డిపాలెం, బందవానిపాలెం, జుత్తాడ, వాలిమెరక ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

అగనంపూడి: పెదముషిడివాడ సబ్ స్టేషన్ పరిధిలోని ఎంఎస్ఎంఈ పార్కు విస్తరణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. అందువల్ల ఫార్మాసిటీ పునరావాస కాలనీ, గొన్నవానిపాలెం, ఇ-మర్రిపాలెం, లంకెలపాలెం, ఇండస్ట్రియల్ ఏరియా, మంత్రిపాలెం, కన్నూరు, నక్కవానిపాలెం, గండివానిపాలెం, విజయరాంపురం, పెదముషిడివాడ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి తమకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ఉక్కు కార్మికులకు వేతన సవరణ చేయాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 6: ఉక్కు కార్మికులకు తక్షణమే వేతన సవరణ చేయడంతో పాటు జీతాలు చెల్లించాలని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులపై యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. కార్మికులకు ఇప్పటివరకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్మిక సంక్షేమంపై యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజు, కారు రమణ, నాయుడు, అప్పారావు, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలంటూ గతంలో నిరవధిక సమ్మెకు దిగితే, వాటిని పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా హామీలపై యాజమాన్యం స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేసామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, గోవింద్, పి.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

ఉక్కు కర్మాగారం నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు యాజమాన్యం ఉపాధి కల్పించి న్యాయం చేయాలని డీవీఆర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డీవీ రమణారెడ్డి అన్నారు. గురువారం ప్లాంట్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంటేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. సంస్థ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్న కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని, కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలతో పాటు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గల్లా శంకర్‌సాయిరాం, కనకరెడ్డి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం రాజీ లేని పోరాటాలు

సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల సాధనలో టీఎన్‌టీయూసీ రాజీ లేని పోరాటాలు సాగిస్తుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు, త్వరలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న చంద్రబాబునాయుడు ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేందుకు యూనియన్ తరపున పోరాటాలు చేస్తున్నామని, వీటిని మరింత ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు నమ్మి సింహాద్రి, చీపురుపల్లి శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వేను సకాలంలో పూర్తి చేయాలి

పెదగంట్యాడ, జూన్ 6: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించేందుకు చేపట్టిన సర్వేను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత ఐఈఆర్పీలను కోరారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే జరుగుతున్న నేపథ్యంలో ఆమె నడుపూరులో ఐఈఆర్పీలు చేస్తున్న సర్వేను గురువారం పరిశీలించారు. ఇప్పటివరకు గుర్తించిన దివ్యాంగులకు పాఠశాలల్లో చేర్పించాలని ఆమె సూచించారు. దీంతో ఇంతవరకు గుర్తించిన పద్నాలుగు మంది దివ్యాంగ చిన్నారులకు మండల విద్యాశాఖాధికారుల ద్వారా అక్కడికక్కడే పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో సహిత విద్య ఏపీవో అప్పలనాయుడు, మండల విద్యాశాఖాధికారులు ఈ.శ్రీనివాసరావు, రమణాజీ, భవిత ఉపాధ్యాయులు ఎం.సూర్యనారాయణ, బి.జయభారతి పాల్గొన్నారు.

శ్లాబ్ పెచ్చులు పడడంతో ఇద్దరు చిన్నారులకు గాయాలు

కూర్మన్నపాలెం, జూన్ 6: ఓ ఇంట్లో శ్లాబ్ పెచ్చులు ఊడి పడడంతో ఇద్దరు చిన్నా రులు గాయపడిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అప్పికొండ సమీపం చేపలపాలెంలో నివాసముంటున్న చేపల విజయబాబు ఇంటికి పలు గ్రామాల నుంచి ఆయన సోదరిలు, సోదరుల పిల్లలు విచ్చేశారు. గురువారం ఎనిమిది మంది చిన్నారులు ఓ ఇంట్లో ఆడుకుం టుండగా ఒక్కసారిగా శ్లాబ్ పెచ్చులూడి పడడంతో వారంతా భయభ్రాంతులకు గురై పెద్దగా కేకలు వేశారు. ఈ ఘటనలో ముత్యాలమ్మపాలేనికి చెందిన సూరాడ శ్రీనిధికి తీవ్రంగా, అప్పికొండకు చెందిన భార్గవ్ తలకు, చేతికి గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఏసీపీ త్రినాథ్, దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ఆస్పత్రికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

విద్యా కానుక వస్తువుల నాణ్యత పరిశీలన


స్కూల్ బ్యాగులను పరిశీలిస్తున్న గీత, అప్పలనాయుడు, తదితరులు

పెదగంట్యాడ, జూన్ 6: మండలంలోని పాఠశాలల పిల్లలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధం చేసిన విద్యా కానుక వస్తువులు స్కూల్ బ్యాగులు, పుస్తకాల నాణ్యతను జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత, ఏపీవో అప్పలనాయుడు పరిశీలించారు. నెల్లిముక్కులోని స్టాక్ పాయింట్‌కు వచ్చి వీటిని పరిశీలించి, వీటిని పంపిణీ చేశాక విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఎలాంటి విమర్శలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారులకు సూచించారు. విద్యా కానుకలు విద్యార్థుల సంఖ్యకు సరిపడేలా ఉన్నాయా, లేదా అని ఎంఈవోలు ఈ.శ్రీనివాసరావు, కె.రమణాజీలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయిన రోజే వీటిని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. వారి వెంట ఎంఆర్‌సీ సిబ్బంది ఉన్నారు.

కొత్తపల్లి శ్రీహరిరాజుకు నివాళి

మల్కాపురం, జూన్ 6: తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షునిగా వ్యవహరించిన దివంగత కొత్తపల్లి శ్రీహరిరాజు జయంతి సందర్భంగా ఆయనకు టీడీపీ శ్రేణులు, ఆయన అభిమానులు గురువారం శ్రీహరిపురంలో నివాళులర్పించారు. పలువురు నాయకులు ఆయన చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలిమరశెట్టి శ్రీను, మజ్జి సోమేశ్, ఉరుకూటి డేవిడ్, జయశంకర్, పొట్టిమూర్తి, కె.ఆదినారాయణ (ఆది), తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

ప్రజాసేవలో మమేకమవుతా..

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతా

పెందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూన్ 6: పెందుర్తిలో పెద్ద మేస్త్రీలా పనిచేసి.. నిరంతరం ప్రజాసేవలో మమేకమవుతూ తనకు ఓట్లు వేసిన ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యేగా ఎన్నికైన పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లోని ఇంద్రాణి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఆయన కూటమి నాయకులు, కార్యకర్తలతో కృతజ్ఞత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో నాలుగో స్థానంలో విజయం సాధించడంతో తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. నెగ్గడమే కాదు తగ్గడం కూడా తనకు తెలుసునని, మరింత అణుకువతో నిరంతర శ్రామికుడిలా పనిచేసి పెందుర్తిని అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. పంచకర్ల అందరివాడన్న గుర్తింపుతోనే ఇంత మెజారిటీని ప్రజలు ఇచ్చారని, తాను తప్పు చేసే ప్రసక్తే లేదని, అలాంటిదేదైనా జరిగితే నిలదీయండన్నారు. ఎన్నికల్లో గెలుపు పొగరుతో విర్రవీగినందున ముందే దేవుడు స్క్రిప్ట్ రాసాడని, అందుకే 151ని 11గా చేశాడని పరోక్షంగా వైసీపీని విమర్శించారు. ఎన్నికల్లో స్థానికుడిని కాదని ప్రత్యర్థుల విమర్శలు బాధించాయని.. 2009లో తనకు రాజకీయ భిక్ష పెట్టిందని పెందుర్తి ప్రజలేనని, అదే నమ్మకంతో పవన్‌కల్యాణ్‌ని మెప్పించి మళ్లీ ఇక్కడ పోటీ చేసి గెలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

నిరంతరం అందరికీ ఉంటానని, ఏ సమస్యపైనైనా తన సెల్‌కు కాల్ చేస్తే పరిష్కార మార్గాన్ని చూపుతానని పంచకర్ల పేర్కొన్నారు. సమస్యలను సవాళ్లుగా తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ క్రమంలో పంచగ్రామాల భూ సమస్య కాలుష్య గ్రామం తాడి తరలింపు, మత్స్యకార గ్రామాల నిర్వాసితులకు ఉపాధి, పెందుర్తిలో ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు, తదితర అంశాలపై దృష్టిసారిస్తామన్నారు. అనంతరం పంచకర్ల రమేశ్‌బాబుకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ సేనాపతి శంకరరావు, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, జనసేన నాయకులు ముదునూరి రాజా సుధాకర్, అయిత సింహాచలం, పిళ్లా జగన్మోహనపాత్రుడు, గొర్లె అప్పారావు, పి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవి రేస్‌లో పంచకర్ల!

మంత్రి పదవి రేస్‌లో తాను ఉన్నానని పెందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన పంచకర్ల రమేశ్‌బాబు సంకేతాలు ఇస్తున్నారు. సుజాతనగర్‌లో జరిగిన సమావేశంలో మంత్రి పదవిని మీరు ఆశిస్తున్నారా అని విలేకరులు ప్రశ్నించారు. దీనికి ఆయన ఆశించడం లేదని చెబితే అది తప్పు చెప్పినట్టవుతుందని సమాధానం ఇచ్చారు.

పలు ఆలయాల్లో పంచకర్ల రమేశ్‌బాబు పూజలు


కృష్ణానగర్ వరసిద్ధి వినాయకుని సన్నిధిలో పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

వేపగుంట: గ్రేటర్ 93, 94వ వార్డుల పరిధిలోని పలు ఆలయాలను పెందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన పంచకర్ల రమేశ్‌బాబు సందర్శించారు. ఉదయం కృష్ణానగర్‌లోని వరసిద్ధి వినాయక ఆయలంలో పూజలు చేశాక వేపగుంటలోకి ముత్యాలమ్మ, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావుతో పాటు నాయకులు ముత్తా నాయుడు, ఎస్.రమణ, దేముడు, ఆనంద్, జి.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నగిరి శ్రీవారి హుండీ ఆదాయం రూ.92,288

అక్కిరెడ్డిపాలెం, జూన్ 6: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవస్థానం అధికారులు పీఎల్ఎన్ రాజు, ఎ.జగన్నాథరావు సమక్షంలో సిబ్బంది హుండీని తెరిచి లెక్కించారు. ఈ ఏడాది మార్చి 22 నుంచి గురువారం వరకు భక్తులు హుండీలో వేసిన నగదు రూ.92,288 లభించింది. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనంపై వర్క్‌షాప్

మల్కాపురం: చిత్రలేఖనంలో పలువురు చిన్నారులకు గురువారం ఇక్కడి శాఖా గ్రంథాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రముఖ చిత్రకారుడు ద్వారపూడి శ్రీనివాస్ మనోహర్ చిన్నారులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. చిత్రాలను ఎలా వేయాలో బోర్డుపై వేసి చూపించారు. అనంతరం చిన్నారులకు నృత్య పోటీలు నిర్వహించారు.












టీడీపీ కార్యాలయంలో సంబరాలు జరుపుకుంటున్న తెలుగు మహిళలు


సీతారామాంజనేయ ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న నేతలు

టీడీపీ కార్యాలయంలో తెలుగు మహిళల సంబరాలు

మహరాణిపేట, జూన్ 6: రాష్ట్రంలో కూటమికి అఖండ విజయం లభించడంతో గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహిళలు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ముందుగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని వేడుకలు జరిపారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు తెలుగు మహిళల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి ఈతలపాక సుజాత, జిల్లా కార్యదర్శి గణగళ్ల సత్యవతి, రమాదేవి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన సందర్భంగా గురువారం శ్రీ ఉమా రామలింగేశ్వర కోదండ సీతారామాజనేయస్వామి ఆలయంలో తెలుగుదేశం పార్టీ అభిమానులు 108 కొబ్బరి కాయలు కొట్టి, ప్రత్యేక పూజలు చేశారు. శెట్టిబలిజ సంఘం రామాలయం ప్రాంగణంలో బత్తిన దంతేశ్వర రావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో రామరాజ్యం రావడం, దుష్ట పరిపాలన అంతం కావడంతో మొక్కు తీర్చుకున్నామన్నారు. ప్రజారంజక పాలనతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖ శాంతులు కలగాలని కోరుతూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. అనంతరం మిఠాయిలు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిని కలిసిన విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జూన్ 6: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని ఉత్తర నియోజకవర్గం విజేత విష్ణుకుమార్ రాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి పరశురామ్‌రాజు, ఉత్తర ఇన్‌చార్జి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


పురందేశ్వరితో విష్ణుకుమార్‌రాజు, తదితరులు


విష్ణుకుమార్‌రాజును అభినందిస్తున్న విమాన ప్రయాణికుల సంఘం సభ్యులు

విమాన ప్రయాణికుల సంఘం అభినందనలు

విశాఖపట్నం: ఉత్తర నియోజకవర్గం నుంచి గెలుపొందిన విష్ణుకుమార్ రాజును ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు నరేష్‌కుమార్, కుమార్ రాజా, డీఎస్ వర్మ, కాశీవిశ్వనాథరాజు అభినందించారు. మంత్రి పదవి రావాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జూన్ 6: మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బి.సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార హిల్ వ్యూ పార్క్, రాకెట్ పార్క్, ఏఎస్‌ఆర్‌నగర్, వోల్వో ఆఫీస్, సబ్బంహరి గృహం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.

26, 44 వార్డుల్లో బీజేపీకి మెజారిటీ

అక్కయ్యపాలెం, జూన్ 6: ఉత్తర నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ 26, 44 వార్డుల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి విషుకుమార్‌రాజుకు మెజారిటీ లభించింది. 26వ వార్డులో 22 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 18,501 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 11,688 మంది ఓట్లు వేశారు. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు 7,426 మంది ఓట్లు వేయగా వైసీపీ అభ్యర్థి కేకే రాజుకు 3,120 మంది ఓటు వేశారు. మిగిలిన ఓట్లు ఇతర పార్టీల అభ్యర్థులకు, నోటాకు పడ్డాయి. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు 4,306 ఓట్లు మెజారిటీ లభించింది. కాగా 44వ వార్డులో 17 పోలింగ్ బూతులు ఉన్నాయి. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు 5,910 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి కేకే రాజుకు 3,735 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు 2,345 ఓట్లు మెజార్టీ వచ్చింది.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అక్కయ్యపాలెం, జూన్ 6: గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని షిర్డీ సాయిధ్యానమందిరంలో గురువారం ఓమ్ని హాస్పిటల్స్, గిగ్గిల్స్ బై ఓమ్ని ఆర్కే హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. భక్తులు, ఆలయ సిబ్బంది పరీక్షలు చేయించుకున్నారు. వేసవిలో వచ్చే వ్యాధులను దృష్టిలో పెట్టుకొని అందరికీ ఆరోగ్యం, గొప్ప జీవన శైలిని అందించాలనే ఉద్దేశంతో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు హాస్పిటల్స్ యాజమాన్యం తెలిపింది. వాసన్ ఐ కేర్ ఆస్పత్రి సిబ్బంది ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, రాంబాబు, సభ్యులు, వైద్య సిబ్బంది గౌరినాయుడు, చంటి, భాగ్యశ్రీ, డాక్టర్ షణ్ముఖ్, నవీన్, రమ్య పాల్గొన్నారు.

వయోజనులకు టీబీ వ్యాక్సిన్


బురుజుపేటలో వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

పూర్ణామార్కెట్, జూన్ 6: క్షయ నిర్మూలనకు వీలుగా నగరంలో 60 ఏళ్లు వయసు దాటిన వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నారు. ఇందులో భాగంగా బురుజుపేట ఆయూష్మాన్ డిస్పెన్సరీలో ఆరోగ్య సిబ్బంది గురువారం పలువురికి టీకాను వేశారు. దీనిపై ముందుగా ప్రచారం చేపట్టిన సిబ్బంది కేంద్రాలకు వచ్చిన వయోజనులకు టీకాలను వేశారు. వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, ఎవరెవరికి వ్యాక్సిన్ వేస్తారో ఎన్‌హెచ్‌ఓ డి.నాగలక్ష్మి వివరించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రతి గురు, సోమవారాల్లో ఉచితంగా టీకా వేస్తామన్నారు.

'నిబద్ధత గల నేత చంద్ర రాజేశ్వరరావు'


రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి, నేతలు

అల్లిపురం, జూన్ 6: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ నాయకుడు చంద్ర రాజేశ్వరరావు నిబద్ధతగల నేత అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. సీఆర్ 110వ జయంతి సందర్భంగా గురువారం అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. కమ్యూనిస్టు దృక్పథంతో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్లినందుకు సోవియట్ యూనియన్ ఆర్డర్ ఆఫ్ లెనిన్, బల్గేరియా ఆర్డర్ ఆఫ్ డెమిత్రోఫ్ అవార్డు, చెకోస్లోవేకియా, మంగోలియా వంటి దేశాలు పలు అవార్డులతో సత్కరించాయన్నారు. నేటి కమ్యూనిస్టులకు సీఆర్ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎస్‌కె రహమాన్, ఎం.మన్మథరావు, జి.కాసులరెడ్డి, ఆదారి ఆదినారాయణ, వై.రామారావు తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరుచేయాలి : యూటీఎఫ్


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నేతలు

మహరాణిపేట, జూన్ 6: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో కె.మోహన్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్, కోశాధికారి కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం


శిక్షణ పొందిన చిన్నారులతో నిర్వాహకులు

కంచరపాలెం, జూన్ 6: జీవీఎంసీ 56వ వార్డు ఆర్పీపేట మహాత్మా గాంధీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గం చిన్నారులకు నెలరోజులు పాటు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో ముగిసింది. ఈ మేరకు గురువారం చిన్నారులకు బహుమతుల ప్రదానం జరిగింది. ఆటల పోటీలతో పాటు వైజ్ఞానిక అంశాలపై శిక్షణను అందించారు. ముగింపు సందర్భంగా చిన్నారులకు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డి.గోవిందరాజు, కె.వెంకటరావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కూన రవిని కలిసిన సనపల వరప్రసాద్


కూన రవికి శుభాకాంక్షలు చెబుతున్న సనపల, తదితరులు

మురళీనగర్, జూన్ 6: శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నుంచి విజయం సాధించిన కూన రవికుమార్‌ను విశాఖ టీడీపీ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్, తదితరులు గురువారం శ్రీకాకుళంలోని ఆయన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న రోజుల్లో ఉన్నత పదవులు అలంకరించాలని కోరుతూ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సనపల నరసింహస్వామి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ వారోత్సవాలు

విశాఖపట్నం, జూన్ 6: వాల్తేరు డివిజన్‌లో అంతర్జాతీయ రైల్వే లెవెల్ క్రాసింగ్ అవగాహన వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రైల్వే ట్రాక్‌ను దాటే సమయంలో పాటించాల్సిన భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీరింగ్, భద్రతా విభాగం, సివిల్ డిఫెన్స్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డివిజన్ పరిధిలోని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నామని, ప్రతిచోట బ్యానర్లు, పోస్టర్లను ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ సిద్దార్థ ప్రధాన్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం భద్రతా చర్యలపై సివిల్ డిఫెన్స్ సిబ్బంది నాటకం ప్రదర్శించారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌ఎం, ఇతర అధికారులు

చంద్రబాబును కలిసిన బండారు


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, జూన్ 6 : మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం విజేత బండారు సత్యనారాయణ మూర్తి గురువారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అధినేత చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చంద్రబాబుతో కొద్దిసేపు ముచ్చటించారు.

...అంతా ఆయనే చేశారు

... 5వ పేజీ తరువాయి

దీటుగా డబ్బులు ఖర్చుపెట్టినా ఘోరంగా ఓటమి పాలవ్వడం ఆశ్చర్యంగా ఉందని కొందరు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిస్థితికి సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వ్యవహారశైలే కారణమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచే వార్డు వలంటీర్లు, వార్డు/గ్రామ సచివాలయాల పేరుతో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు ప్రజలతో సంబంధాలు లేకుండా చేశారని విమర్శిస్తున్నారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నుంచి, వారికి వాటిని అందజేసే బాధ్యత వరకూ అంతా వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అప్పగించడంతో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉన్న తాము నామమాత్రంగా మారిపోయామని వాపోతున్నారు.

అలాగే గత ఐదేళ్లలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగాలు తప్పితే ఎలాంటి ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం, చివర్లో హడావుడిగా విడుదల చేసినప్పటికీ ఆచరణలో పెట్టకపోవడం వల్ల యువత, నిరుద్యోగుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత నెలకొందని అభ్యర్థులు, నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇక గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను క్రమబద్ధీకరించే విషయంలో సవాలక్ష ఆంక్షలు పెట్టడంతో వారిలో కూడా ఉద్యోగం కల్పించారనే కృతజ్ఞత పోయి, అసంతృప్తి పేరుకు పోయిందని పేర్కొంటున్నారు.

కొంపముంచిన మద్యం వ్యాపారం

తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం పాలసీని మార్చడం కూడా తాజా ఎన్నికల్లో ఓటమికి కారణంగా కొందరు అభ్యర్థులు, నేతలు విశ్లేషిస్తున్నారు. గతంలో ఉన్న ప్రైవేటు మద్యం దుకాణాలను తొలగించి, ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించడం కూడా పార్టీ ఓటమికి దారితీసిందంటున్నారు. తమ పార్టీ నేతలే కొన్ని మద్యం డిస్టిలరీలను లీజుకు తీసుకుని అక్కడ తయారయ్యే నాసిరకం మద్యాన్ని దుకాణాల్లో విక్రయించడం మొదలెట్టారని, కూలీలు, దిగువ మధ్య తరగతి ప్రజలు ఆ మద్యం తాగి అనారోగ్యం పాలవ్వడంతో వారి కుటుంబ సభ్యుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఏర్పడిందని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు మద్యం ధరలను విపరీతంగా పెంచేయడం, కావాల్సిన బ్రాండ్లు అందుబాటులో లేకుండా చేయడంతో మందుబాబులు కూడా ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. అమ్మఒడి, చేయూత, ఆసరా వంటి పథకాల విషయంలో ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉన్నప్పటికీ, నాసిరకం మద్యం సేవించి సాయంత్రం ఇంటికి చేరుకునే యజమానిని చూసి ఆ ఇంట్లోని సభ్యులంతా జగన్‌కు వ్యతిరేకంగా మారారని విశ్లేషిస్తున్నారు. సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పి మాట తప్పడం కూడా ప్రజల్లో జగన్ విశ్వసనీయతను దెబ్బతీసిందని నాయకులు అంటున్నారు. ప్రభుత్వ పనితీరుపై వివిధ వర్గాల ప్రజలు ఏమనుకుంటున్నారు...ఇంకా ఏం కోరుకుంటున్నారు?, ఎలాంటి పథకాలు, అభివృద్ధి పనులు చేయాలో నిత్యం ప్రజల్లో తిరిగే నాయకులతో కాకుండా దొడ్డిదారిన ప్యాలెస్‌లో చేరి భజన చేసేవారితో చర్చించడం, వారి సలహాలను తీసుకోవడం జగన్‌తోపాటు తమను కూడా నట్టేట ముంచేసిందని లబోదిబోమంటున్నారు. అదేవిధంగా ఐదేళ్లలో సీఎంగా ప్రజల్లో తిరగకపోవడం, ప్రజా ప్రతినిధులకు కలిసే అవకాశం ఇవ్వకపోవడం, జగన్ ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెత్తు పోకడలే 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం కావడానికి కారణమంటున్నారు. ఎంతసేపూ బటన్ నొక్కితే చాలు...అదే పరిపాలన అనుకునే భావనలో సీఎం జగన్ ఉండిపోయారని, అదే దారుణంగా దెబ్బతీసిందంటున్నారు.

వలంటీర్లతోనే భారీ నష్టం

... 5వ పేజీ తరువాయి

తనను టార్గెట్ చేశారని, క్షేత్రస్థాయిలో జరుగుతున్నది పార్టీ అధినేతకు చెబుదామనుకుంటే సీఎం పేషీ కోటరీ అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. పార్టీలో ఎవరిని కదిలించినా ఈ తరహా ఆవేదనే వ్యక్తమవుతోంది. ఇది జగన్మోహన్‌రెడ్డి చేజేతులా చేసుకున్నదేనని, ఇందులో ఎవరినీ తప్పు పట్టడానికి లేదని అంటున్నారు.

కలిసి మెలిసి పనిచేసుకుందాం...

... 5వ పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ చట్టాన్ని సవరించి నాలుగేళ్లలోపు అవిశ్వాస తీర్మానం పెట్టుకునే వెసులుబాటు కల్పిస్తే నగర మేయర్ పదవి కోల్పోయే అవకాశం ఉంది. తమ కార్పొరేటర్లు పార్టీ మారబోతున్నారనే సమాచారం తెలిసి జీవీఎంసీ పాలకవర్గంలోని వైసీపీ పెద్దలు అప్రమత్తమయ్యారు. టీడీపీలోని కీలక కార్పొరేటర్లకు ఇద్దరు నాయకులు ఫోన్ చేసి రాజీ ప్రతిపాదనలు చేస్తున్నారు. మేయర్ పదవికి ఇబ్బంది కలిగించకుండా ఉంటే డిప్యూటీ మేయర్ పదవితోపాటు స్టాండింగ్ కమిటీలో నలుగురికి స్థానం కల్పిస్తామని ప్రతిపాదించినట్టు తెలిసింది. దీనికి టీడీపీ నేతలు ససేమిరా అన్నట్టు తెలిసింది.

ఆర్డీ కార్యాలయంలో అడ్డగోలు వ్యవహారం

... 5వ పేజీ తరువాయి

ఇతర ఆస్పత్రుల్లో, విజయనగరం జిల్లాలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా ఏజెన్సీలోని మెడికల్ కాలేజీలో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అభ్యర్థులు పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలతో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారంటూ సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న చంద్రబాబునాయుడు దృష్టికి కూడా తీసుకువెళ్లారు. ఈ ప్రక్రియను నిలిపివేయాల్సిందిగా ఆయన డీఎంఈకు సూచించారు. దీంతో విశాఖలోని ఆర్డీ కార్యాలయంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా గురువారం చేపట్టాల్సిన కౌన్సెలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. దీనిపై అభ్యర్థులు ఆనందాన్ని వ్యక్తంచేశారు.

దొడ్డిదారి బదిలీలకు బ్రేక్

... 5వ పేజీ తరువాయి

భవిష్యత్తులో ఏర్పడే ఖాళీలను ముందుగానే గుర్తించి అక్కడకు పోస్టింగ్స్ ఇచ్చారు. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి బదిలీ ప్రొసీడింగ్స్ ఇవ్వడం ప్రారంభించారు. బదిలీ ఉత్తర్వులు ఇస్తున్నామని, అయితే ప్రతి నెలలో ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకుని జూన్, జూలై, ఆగస్టు నెల వరకు విధుల్లో చేరడానికి అనుమతి ఇస్తున్నామని, ఆ మేరకు డీఈవో చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. విచిత్రం ఏమిటంటే...ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత కూడా రెండు ప్రొసీడింగ్స్ ఇచ్చారంటే ఎంతకు బరితెగించారో అర్థం చేసుకోవచ్చు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 12 వరకు మొత్తం ఎనిమిది ప్రొసీడింగ్స్ మేరకు ఉమ్మడి జిల్లాలో 82 మంది టీచర్లను దొడ్డిదారిన బదిలీ చేశారు. ఉత్తర్వులు వచ్చినా నగర పరిసరాల్లో ఖాళీలు లేకపోవడంతో పలువురు డీఈవో కార్యాలయం చుట్టూ తిరిగారు. అందులో 13 మంది మాత్రం తమకున్న పలుకుబడి ఉపయోగించి ప్రతినెలా ఏర్పడే ఖాళీల్లో నియమితులయ్యారు. ఇంకా 69 మంది మిగిలిపోయారు. ఈలోగా ఎన్నికల ప్రక్రియ ఊపందుకోవడం, పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో టీచర్లకు పోస్టింగ్స్ ఇవ్వలేదు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి తెలుగుదేశం అధికారంలోకి రావడంతో అక్రమ బదిలీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఆ 69 మంది టీచర్లు షాక్‌కు గురయ్యారు. బదిలీల కోసం ఇచ్చి సొమ్ములు పోయినట్టేనని ఒక టీచర్ ఆవేదన వ్యక్తంచేశారు.

దాడి కేసులో వ్యక్తికి రెండేళ్లు జైలు

సబ్బవరం, జూన్ 6: మండలంలోని పైడివాడ అగ్రహారంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో అనకాపల్లి 12వ ఎంఎం కోర్టు నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. గ్రామానికి చెందిన గుండాల సంతోషి ఇంటి వద్ద 2022 మార్చి 12న వద్ద బోరు తీయించారు. తమ ఇంటిపై బురద పడుతుందని పెచ్చెటి దుర్గారావు సంతోషి తలపై రాయితో కొట్టాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో శిక్ష పడింది.

చిప్పాడలో దివీస్ ఉద్యోగుల ర్యాలీ

భీమునిపట్నం (రూరల్), జూన్ 6 : మండలంలోని చిప్పాడ గ్రామంలో దివీస్ కర్మాగారం ఉద్యోగులు, సిబ్బంది మన భూమి, మన భవిష్యత్తు పేరుతో ర్యాలీ నిర్వహించారు. మొక్కల పెంపకం కోసం చేపట్టిన ఈ ర్యాలీకి గ్రీన్ ర్యాలీ అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఎంపీ మురళీకృష్ణ మాట్లాడుతూ భూమిని పరిరక్షించకపోతే ప్రజలకు మనుగడ లేదని, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్ దేవేందరరావు, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

సంతపేటలో..

తగరపువలస : చిట్టివలసలోని సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం. పద్మావతి, మ్యాజిక్ బస్ ట్రైనింగ్ సమన్వయ అధికారి దూడ రమేష్, సభ్యులు శారద, దుర్గ, రమ్య రమణమ్మ, సుజాత, నందిని పాల్గొన్నారు.

అప్పన్నకు పసిడి కుసుమార్చన



సింహాచలం, జూన్ 6 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం పసిడి కుసుమార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి ఏఈఓ ఆనందకుమార్ పర్యవేక్షణలో స్వర్ణ సంపెంగలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు వెంకట రమణాచార్యులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ పసిడి కుసుమాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు శేషవస్త్రాలు, వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

కూటమి గెలుపుతో మొక్కులు చెల్లింపు

సింహాచలం, జూన్ 6 : చంద్రబాబు నాయకత్వంలో కూటమి అఖండ విజయం సాధించడం, భీమిలి నుంచి గంటా శ్రీనివాసరావు గెలుపొందడంతో ఆనందపురం మండలం గండిగుండం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు స్వామివారిని గురువారం దర్శించుకున్నారు. పార్టీ నాయకుడు గంర్రెడ్డి స్వామినాయుడు సారథ్యంలో కార్యకర్తలు సింహగిరి రెండవ ఘాట్ రోడ్డులో నడక సాగించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

పద్మనాభం, జూన్ 6 : మండలంలోని పాండ్రంగి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారులు రైతులకు గురువారం పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసారాన్ని పెంపొందించడానికి, వరి పంట వేసేటప్పుడు ఎరువుల వినియోగం తగ్గడానికి పీఎండీఎస్ కిట్లు, జీలుగు విత్తనాలు దోహదపడతాయని చెప్పారు. వీటిని రైతు భరోసా కేంద్రాల్లో కూడా అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు మోహనరావు, జిల్లా హెచ్ఆర్ చక్రవర్తి, టీము లీడర్ గణేష్, జిల్లా అసోసియేట్ అనూరాధ, మాస్టర్ ట్రైనర్ సాగర్, వీఏఏ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య నాగరాజుకు నివాళి

వెంకోజీపాలెం, జూన్ 6 : ఏయూ ఎకనామిక్స్ విభాగం ఆచార్య జి.నాగరాజు అకాల మృతి యూనివర్సిటీకి తీరని లోటని ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహరావు అన్నారు. స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో గురువారం జరిగిన ఆచార్య నాగరాజు సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. నాగరాజు యూబీఏ కోఆర్డినేటర్‌గా చేసిన సేవలను కొనియాడారు. అర్థశాస్త్రం విభాగాధిపతి ఆచార్య యస్. పుల్లారావు మాట్లాడుతూ నాగరాజు మంచి సహచరుడని, మృదు స్వభావని కొనియాడారు.

సినిమా గైడ్

- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** సంగం, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **రాజుయాదవ్ :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **బాక్ :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయలు 24, కాలీఫ్లవర్ 35, క్యాబేజ్ 24, క్యారెట్ 38, దొండకాయలు 18, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది) 156, బరబటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 38, కీరదోస 24, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

అన్ని వర్గాలూ కూటమి వైపే!


- కలిసొచ్చిన కుల సమీకరణలు
- అండగా నిలిచిన యాదవులు, కాపులు

ఎంవీపీ కాలనీ, జూన్ 6 : తూర్పు నియోజకవర్గంలో ఈసారి వర్గ సమీకరణాలు అభ్యర్థులను కాస్తా టెన్షన్ పెట్టాయనే చెప్పాలి. ఈ వర్గం తమకే వేస్తుందని, ఆ వర్గం అటు వైపే అని లోలోన మదనపడినప్పటికీ దాదాపు అన్ని వర్గాలు టీడీపీకే మద్దతు పలికినట్టు స్పష్టమైంది. నియోజకవర్గంలో ఒకటో రెండో వర్గాలు కాకుండా నాలుగైదు వర్గాలు ఉండడంతో పరిస్థితి ఎటు నుంచి ఎటు మారుతుందన్నది అర్థం కాక విశ్లేషకులు కూడా తలలు పట్టుకున్నారు. అభ్యర్థులు, సీటు రాని వారి ప్రణాళికలు, పార్టీ మారిన వారు, పొత్తులో ఉన్న పార్టీల వ్యతిరేకులు ఇలా అనేక అంశాలు ఈ ఎన్నికల్లో ప్రభావితం చేస్తాయన్న ఆందోళన ఉండేది. వాస్తవానికి నియోజకవర్గం తెలుగుదేశానికి పెట్టని కోటగా ఉంది.నియోజకవర్గం ఏర్పాటు తరువాత మూడు సార్లు టీడీపీనే ప్రజలు గెలిపిస్తూ వచ్చారు. నాలుగోసారి కూడా భారీ మెజార్టీతో గెలిపించి మరోసారి ఇది టీడీపీ నియోజకవర్గమేనని నిరూపించారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి సర్వ శక్తులూ ఒడ్డారు. ఓవిధంగా చెప్పాలంటే రాష్ట్రంలో అత్యధికంగా డబ్బులు ఖర్చు చేసింది ఇక్కడే. ఇతర తాయిలాలు కాకుండా ఓటుకు కనీసం రూ. 2500 ఇవ్వగా, కీలకం అనుకున్న చోట ఓటుకు అయిదు వేలకు పైగా ఇచ్చిన ఉదంతాలు ఉన్నాయి. అయినా అన్ని వర్గాలు టీడీపీ వైపే మొగ్గు చూపాయి.

యాదవులు అధికం

నియోజకవర్గంలో యాదవులు అధికం. వారి ఓట్లు సుమారు 55 వేల వరకు ఉన్నాయి. అలాగే కాపు ఓట్లు కూడా 45 వేలు, మత్స్యకారులు 45 వేలు, ఎస్సీ, క్రిస్టియన్‌లు 15 వేలు వరకూ ఉండగా, ముస్లింల సంఖ్య కూడా 25 వేల వరకూ ఉంది. ఈసారి వలస పక్షుల ఓట్లు ఎక్కువే. విజయనగరం, శ్రీకాకుళం జిల్లా వాసులు అధిక సంఖ్యలో ఇక్కడ భవన నిర్మాణ కార్మికులుగా, అపార్టుమెంట్లలో వాచ్‌మెన్‌లగా ఉన్నారు.ఎస్టీలు వెయ్యి మంది వరకూ ఓటర్లు ఉండగా, ఉత్తరాది వారు స్వల్ప సంఖ్యలో ఉన్నారు. ఏ ఎన్నికల్లో అయినా సామాజిక వర్గాలకు అనుగుణంగా ఓట్లు పడుతుంటాయి. అధిక సంఖ్యలో ఉన్న వర్గం ఓట్ల ఆధారంగా గెలుపోటములు సంభవిస్తుండడం సాధారణంగా జరిగేదే. అయితే నియోజకవర్గంలో ఒక వర్గం అని కాకుండా నాలుగైదు వర్గాలు ఉన్నాయి. ఏ వర్గం ఎటు పయనిస్తుందో, ఎక్కువ శాతం ఓట్లు పోలవడం, ప్రాధాన్యత గల వర్గాలు రెండు ఎటు మొగ్గితే అటు విజయం వరించే అవకాశాలు ఉన్నాయి. కొన్ని వర్గాల ఓట్లు స్పష్టంగా ఫలానా పార్టీకే అన్నది కూడా కనిపిస్తుంది. యాదవుల్లో చాలా వరకూ టీడీపీకి అనుకూలంగా ఉన్నారు. మొదటి నుంచీ ఆ పార్టీకి మద్దతు ఇచ్చేవారి సంఖ్య ఎక్కువ. గత ఎన్నికల్లో యాదవ సామాజికవర్గం నుంచి అక్కరమాని వైసీపీ తరఫున పోటీలో ఉండడంతో కొంతమేర ఓట్లు చీలిపోయాయి. ఈసారి ఆమెకు ఆ పార్టీలో సీటు దక్కకపోవడం, తెదేపాలో చేరి, వైసీపీకి వ్యతిరేకంగా పనిచేయడంతో పాటు, ఆ పార్టీ నుంచి యాదవ వర్గానికి చెందిన వంశీ కృష్ణ జనసేనలో చేరడం, దక్షిణం నియోజకవర్గంలో పోటీ చేయడంతో, తూర్పులో ఉన్న అతని వర్గం పూర్తిగా తెలుగుదేశానికే మద్దతు పలికింది.

ఇక కాపుల్లో అధిక శాతం పవన్ కల్యాణ్ కారణంగా కూటమికే మద్దతు పలికారు. ఎంతో కొంత కాంగ్రెస్ ఓట్లు ఉన్నవి కూడా ఈసారి పూర్తిగా తెలుగుదేశానికి పడ్డాయి. అలాగే మత్స్యకారులు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. వారిలో 90 శాతానికి పైగా తెలుగుదేశానికి అనుకూలంగా ఉన్న



వారే. తాజా ఎన్నికల్లో మత్స్యకారులే లక్ష్యంగా వైసీపీ అభ్యర్థి నిరంతరం వారితో సంబంధాలు కొనసాగించారు. కొంత శాతాన్ని తన వైపు తిప్పుకున్నా, స్థానికంగా ఉన్న కొందరు నాయకుల అధిపత్యాన్ని జీర్ణించుకోలేని కొందరు కూడా వెలగపూడికే జై అన్నారు. వైసీపీలో నిత్యం తిరిగే వారు కూడా ఈ విషయం బహిరంగంగా చెబుతున్నారు. ఇక ఎస్సీలు, ఎస్టీలు, క్రిస్టియన్ల మద్దతు ఎక్కువగా వైసీపీకి ఉందని ఆ నేతలు చెప్పుకునేవారు. అయితే గతంలో టీడీపీ హయాంలో చర్చిల నిర్మాణానికి తగిన సహాయ సహకారాలు అందించడం వల్ల ఆ వర్గాల ఓట్లు కూడా వెలగపూడికే పడ్డాయి.వలస పక్షుల సంఖ్య కీలకమే. ఇన్నాళ్లూ టీడీపీతో ఉన్నవారు తాజా ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ ఉండడం వల్ల ప్రాంతీయాభిమానం అనే ఆయుధాన్ని ప్రయోగించి, వారిని తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. వలస ప్రాంతీయులు ఎక్కువగా ఆరిలోవ పరిసరాలు, సింహాచలం కొండ ప్రాంతం,హెచ్‌బీ కాలనీ, ఎంవీపీ పరిసరాల్లో ఉన్నారు. కానీ ఈసారి వారు కూడా టీడీపీ అభ్యర్థికే మద్దతు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ పథకాలు పునరుద్ధరించాలి : భాగం

భీమునిపట్నం, జూన్ 6 : భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం విజేత గంటా శ్రీనివాసరావును రాష్ట్ర మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు గురువారం ఎంవీపీ కాలనీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ నియోజకవర్గం చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మెజారిటీ పొందడం పట్ల అభినందనలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల అభ్యున్నతికి 27 పథకాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు మాల మహానాడు రాష్ట్ర మహిళా నాయకురాలు భాగం లక్ష్మి, దళిత నాయకులు మామిడి వెంకట శివ, ఎడ్ల రమేష్ తదితరులు ఉన్నారు. అలాగే గంటా శ్రీనివాసరావును ఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇమంది పైడిరాజు, సన్యాసిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు గంటాను సత్కరించారు.



గంటాకు శుభాకాంక్షలు తెలుపుతున్న గోపాలరావు

తూర్పులో తగ్గని వెలగపూడి జోరు

ఎం.వి.పి.కాలనీ, జూన్ 6 : తూర్పు నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండులోనూ టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబుకు ఆధిక్యం కనిపించింది. ఎక్కడా కూడా ఆయనతో ఎంవీపీ పోటీ పడలేకపోయారు.

రౌండ్	టీడీపీ అభ్యర్థి	వైసీపీ అభ్యర్థి	మెజారిటీ (టీడీపీ)
1.	6521	3095	3428
2.	7586	3465	7549
3.	5949	3638	9860
4.	6609	3421	13048
5.	6723	3019	16752
6	7445	3620	20557
7.	6577	2565	28471
8.	6305	2423	32,353
9.	4264	1254	31481
10.	6151	2379	34353
11.	6436	2831	38858
12.	7535	3829	42564
13.	6525	2358	46731
14.	5664	2136	50259
15.	4970	3063	52166
16.	5440	2152	55454
17.	5312	2847	57919
18.	5472	3103	60288
19.	5101	2678	62711
20.	6283	3239	65755
21.	6317	2661	69411
22.	505	287	69628
పోస్టల్ బ్యాలెట్లతో కలిసి మెజార్టీ			70,876

భైరవస్వామికి అమావాస్య పూజలు

సింహాచలం, జూన్ 6 : సింహాచలం దేవస్థానం ఉపాలయం భైరవస్వామి ఆలయానికి భక్తులు గురువారం పోటెత్తారు. సకల గ్రహ దోష నివారణకు అమావాస్య రోజున భైరవస్వామికి పూజలు చేస్తే మంచిదని భక్తుల విశ్వాసం.ఈమేరకు వేకువజాము నుంచే ఉత్తరాంధ్ర నలుమూలల నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అటవీ శాఖ ప్రధాన ద్వారం వద్ద గేటు పెట్టి తాళాలు వేయడంతో రెండు కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లి స్వామివారిని దర్శించుకుని అమృత కలశాలు సమర్పించారు. అలాగే వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలోనూ వైశాఖ మాస బహుళపక్ష అమావాస్య పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం స్వామివారి రాజభోగం (మహానివేదన) సమయంలో సుదర్శన పెరుమాళ్‌ను పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ మాడ వీధుల్లోని అష్టదిక్పాలకులకు పూజలు చేశారు. అనంతరం గ్రామ బలిహరణ జరిపి రాజభోగ నివేదన జరిపారు. ఈ సందర్భంగా ఇతిహాస పూరాణాల పారాయణలు చేశారు.



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పద్మనాభంలో టీడీపీకి 8464 ఓట్ల మెజారిటీ

పద్మనాభం, జూన్ 6 : మండలంలో పోల్ అయిన ఓట్లలో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు 21281 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 12817 ఓట్లు పోలయ్యాయి. మండలంలో మెజారిటీ 8464 ఓట్లు టీడీపీకి దక్కాయి. 22 పంచాయల్లో 21 పంచాయతీల్లో టీడీపీకి మెజారిటీ రాగా, చిన్నాపురంలో వైసీపీకి కేవలం నాలుగు ఓట్లు మాత్రమే వచ్చాయి. వీటిలో పంచాయతీల వారీగా పాండ్రంగిలో 23 నుంచి 27 వరకు పోలింగు బూత్‌ల ద్వారా టీడీపీకి 2405, వైసీపీకి 1081 టీడీపీకి 1324 ఓట్ల మెజారిటీ వచ్చింది. పద్మనాభంలో రెండు బూత్‌ల ద్వారా టీడీపీకి 1045, వైసీపీకి 368 ఓట్లు రాగా 677 ఓట్ల మెజారిటీ కూటమి అభ్యర్థికి వచ్చింది. రెడ్డిపల్లిలోని 4 పోలింగు కేంద్రాల్లో టీడీపీకి 1714 ఓట్లు, వైసీపీకి 1076 ఓట్ల (మెజారిటీ 638), కొవ్వాడలో రెండు పోలింగు కేంద్రాల ద్వారా టీడీపీకి 1146, వైసీపీకి 538 (మెజారిటీ 608), కొయ్యపేటలో టీడీపీకి 768, వైసీపీకి 214 (554 మెజారిటీ), వెంకటాపురంలో టీడీపీకి 813, వైసీపీకి 268 (545 మెజారిటీ), అనంతవరంలో 3 పోలింగు కేంద్రాలలో టీడీపీకి 1275 వైసీపీకి 759 (516 మెజారిటీ), మద్దిలోని మూడు కేంద్రాల ద్వారా టీడీపీకి 1379 వైసీపీకి 932 (447 మెజారిటీ), పొట్నూరులో రెండు పోలింగు కేంద్రాల్లో టీడీపీకి 1085 వైసీపీకి 657 (428 మెజారిటీ), బీఆర్ తాళ్లవలసలో రెండు కేంద్రాల్లో టీడీపీకి 1206, వైసీపీకి 785 (421 మెజారిటీ), అయినాడలో రెండు కేంద్రాల్లో టీడీపీకి 992 వైసీపీకి 670 (322 మెజారిటీ), శేరిఖండంలో టీడీపీకి 359, వైసీపీకి 192 (167 మెజారిటీ), తునివలసలోని రెండు కేంద్రాల్లో టీడీపీకి 872 వైసీపీకి 580 (292 మెజారిటీ) ఓట్లు వచ్చాయి. లింగన్నపేటలోని రెండు కేంద్రాల్లో టీడీపీకి 634 వైసీపీకి 518 (116 మెజారిటీ), కోరాడలో రెండు కేంద్రాల్లో టీడీపీకి 1086, వైసీపీకి 893 (193 మెజారిటీ), రేవిడిలోని రెండు కేంద్రాల్లో టీడీపీకి 910 వైసీపీకి 547 (363 మెజారిటీ), కృష్ణాపురంలో టీడీపీకి 793 వైసీపీకి 618 (175 మెజారిటీ), బాందేవపురంలోని రెండు కేంద్రాల్లో టీడీపీకి 640 వైసీపీకి 434 (206 మెజారిటీ), విలాస్‌ఖాన్‌పాలెంలో టీడీపీకి 490 వైసీపీకి 299 (191 మెజారిటీ), గంధవరంలోని రెండు కేంద్రాల్లో టీడీపీకి 877, వైసీపీకి 715 (162 మెజారిటీ), పెంటలో టీడీపీకి 344, వైసీపీకి 221 ఓట్లు (123 మెజారిటీ) వచ్చాయి. చిన్నాపురంలో టీడీపీకి 448 వైసీపీకి 452 (వైసీపీకి 4 ఓట్ల మెజారిటీ) ఓట్లు లభించాయి.

ఘనంగా రామానాయుడు జయంతి

సాగర్‌నగర్, జూన్ 6 : ప్రముఖ సినీ నిర్మాత దగ్గుపాటి రామానాయుడు 88వ జయంతి గురువారం తిమ్మాపురం రామానాయుడు స్టూడియోలో ఘనంగా నిర్వహించారు. సురేష్ ప్రొడక్షన్స్ మేనేజర్ వేణు, తదితరులు రామానాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ డాక్టర్ రామానాయుడు నేటి యువతకు రోల్ మోడల్‌గా నిలుస్తారన్నారు. ఎందరో నటీనటులను తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం రామానాయుడు స్టూడియో మేనేజర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

శ్లాబ్ పెచ్చులూడి పడి ఇద్దరు చిన్నారులకు గాయాలు

కూర్మన్నపాలెం, జూన్ 6 : ఓ ఇంట్లో శ్లాబ్ పెచ్చులు ఊడిపడడంతో ఇద్దరు చిన్నారులు గాయపడిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అప్పికొండ సమీపం చేపలపాలెంలో నివాసముంటున్న చేపల విజయబాబు ఇంటికి పలు గ్రామాల నుంచి ఆయన సోదరిలు, సోదరుల పిల్లలు విచ్చేశారు. గురువారం ఎనిమిది మంది చిన్నారులు ఓ ఇంట్లో ఆడుకుంటుండగా ఒక్కసారిగా శ్లాబ్ పెచ్చులూడి పడడంతో



వారంతా భయభ్రాంతులకు గురై పెద్దగా కేకలు వేశారు. ఈ ఘటనలో ముత్యాలమ్మపాలేనికి చెందిన సూరాడ శ్రీనిధికి తీవ్రంగా, అప్పికొండకు చెందిన భార్గవ్ తలకు, చేతికి గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఏసీపీ త్రినాథ్, దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ఆస్పత్రికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

వాడవాడలా కూటమి విజయోత్సవం

పద్మనాభం (రూరల్), జూన్ 6 : ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు విజయం సాధించడంతో మాజీ ఎంపీపీ కె. పద్మ, నగేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం కేక్ కట్ చేసి, సంబరాలు నిర్వహించారు. అలాగే మద్ది రామాలయం నుంచి పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు విజయోత్స ర్యాలీ నిర్వహించారు. మద్ది నుంచి బయలుదేరిన ర్యాలీ మద్ది జంక్షన్ నుంచి పద్మనాభం ప్రధాన జంక్షన్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో భీమిలి మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, గంధవరం ఎంపీటీసీ సభ్యుడు రమణరాజు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సాగి కృష్ణమూర్తిరాజు, వార్డు సభ్యులు రమణమ్మ, వెంకటరావు, మద్ది పాల సొసైటీ డైరెక్టర్లు బుగత ప్రకాష్, కనకల సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు : కూటమి విజయానికి విశేష కృషి చేసిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌ను ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో అరకు నుంచి అనంతపురం వరకు పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారం చేశానన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామ్మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమేరు శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షుడు టండాన వెంకట్రావు, కృష్ణంరాజు, గీతా సింగ్, సాయి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈనెల 12న ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు 5వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ అన్నారు. గురువారం 5వ వార్డు కార్పెంటర్స్ కాలనీ, మారికవలస, శారదానగర్‌లో కూటమి నాయకులు సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నమ్మి రమణ, సూర్య, అప్పారావు, దేవర శివ, పాల్గొన్నారు. విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరె గురునాథ్ ఆధ్వర్యంలో 6వ వార్డు పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో విజయోత్సవం నిర్వహించారు.

మధురవాడ : ఎన్నికల్లో కూటమి విజయఢంకా మోగించడంతో పాటు జనసేన 21 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల్లో విజయం సాధించడంతో 7వ వార్డు మల్లయ్యపాలెంలో గురువారం రాత్రి విజయోత్సవం నిర్వహించారు. ఆ వార్డు జనసైనికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు పిళ్లా నరసింగరావు, పిళ్లా వెంకటరావు, వార్డు అధ్య క్షుడు నాగోతి నరసింహనాయుడు, కార్యదర్శి కొల్లి శంకరరావు, పెనుగొండ గంగరాజు, పెంటపల్లి రవికుమార్, కానూరు రాజేష్, గిడుతూరి పవన్‌కుమార్, ఇమంది అప్పు, 7వ వార్డు కార్యదర్శి కానూరి అచ్చుతరావు, కొల్లి చిరంజీవి, వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కలివేల్పు సూరిబాబు (బుజ్జి), పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : వెలగపూడి గెలవడంతో ఆయా వార్డుల్లో విజయోత్సవాలు కొనసాగుతున్నాయి. 18 వార్డులో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం ఆధ్వర్యంలో కార్యకర్తలు కేకు కట్ చేసి సందడి చేశారు.



కొమ్మాదిలో నాయకులు, కార్యకర్తల ఆనందం



వెంకోజీపాలెం : ఇసుకతోటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రతి రౌండ్‌లోనూ గంటా ఆధిక్యం

భీమునిపట్నం, జూన్ 6 : భీమిలి అసెంబ్లీ సిగ్మెంట్‌లో ప్రతి రౌండ్‌లోనూ టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఆధిక్యం ప్రదర్శించారు. ఆయన వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై ఎక్కడా రెండు వేలకు తగ్గకుండా మెజారిటీ సాధించారు.

రౌండ్ నెం.	కూటమి అభ్యర్థి గంటా	వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి	కూటమి అభ్యర్థి మెజారిటీ
01.	6,811	4,617	2,194
02.	6,870	3,574	3,296
03.	5,981	3,636	2,345
04	5,672	3,581	2,091
05	6,147	3,837	2,310
06	6,848	3,805	3,043
07	6,990	3,916	3,074
08	7,294	4,066	3,228
09	5,000	3,421	1,579
10	7,457	2,811	4,646
11	6,573	3,091	3,482
12	6,863	3,289	3,574
13	8,043	3,213	4,830
14	6,181	2,197	3,984
15	7,081	2,765	4,316
16	6,541	2,365	4,176
17	6,210	2,108	4,102
18	6,771	3,959	2,812
19	6,506	3,355	3,151
20	7,610	2,768	4,842
21	7,050	2,806	4,244
22	6,582	2,556	4,026
23	6,475	3,289	3,186
24	6,159	2,879	3,280
25	7,596	2,908	4,688
26	6,156	1,920	4,236
	1,73,467	82,732	90,735

పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి గంటా మొత్తం 92,401 ఓట్ల ఆధిక్యత సాధించారు. ప్రత్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు గంటాకు వచ్చిన ఆధిక్యత కంటే తక్కువగా ఓట్లు లభించడం గమనార్హం.

ఐదు, ఆరు వార్డుల్లో గంటా మెజారిటీ

కొమ్మాది, జూన్ 6 : భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు ఆరో వార్డు నుంచి 10 వేల మెజారిటీ లభించింది. వార్డులోని 35 బూత్‌ల్లో ప్రతి బూత్‌లోనూ ఆయన మెజారిటీ సాధించారు. 35 బూత్‌లకు మొత్తం 27439 ఓట్లు పోలవ్వగా గంటాకు 17667 ఓట్లు, వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 7477 ఓట్లు పోలయ్యాయి. ఇతరులకు 1900 ఓట్లు లభించాయి. వార్డులో మొత్తం 35 బూత్‌ల్లో గంటాకు 10190 ఓట్ల మెజారిటీ లభించింది. అలాగే 5వ వార్డులోని 30 బూత్‌ల్లో గంటాకు 6735 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇక్కడ 30 బూత్‌ల్లో 23689 ఓట్లు పోలవ్వగా గంటాకు 14341 ఓట్లు, ముత్తంశెట్టికి 7606 ఓట్లు, ఇతరులకు 1736 ఓట్లు పోలయ్యాయి.

98వ వార్డులో 4289 మెజారిటీ

సింహాచలం : గంటా శ్రీనివాసరావుకు 98వ వార్డులో 4289 ఓట్ల మెజారిటీ లభించింది. వార్డులోని 16 బూత్‌ల్లో 6897 ఓట్లు పోలవ్వగా ఆయనకు 232వ పోలింగ్ బూత్‌లో అత్యధికంగా 518 ఓట్ల ఆధిక్యం వచ్చింది.

నోటాకు 3,028 ఓట్లు

భీమునిపట్నం, జూన్ 6 : భీమిలి నియోజకవర్గంలో 2014 ఎన్నికల్లో 2449 ఓట్లు, 2019 ఎన్నికల్లో 4,256 ఓట్లు నోటాకు రాగా ఈసారి 3,028 ఓట్లు వేశారు. ఈ సంఖ్య తగ్గేలా చూడాల్సిన అవసరం వుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. బీఎస్పీ, జై భారత్ నేషనల్ పార్టీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, జాతీయ జనసేన పార్టీ, సమాజవాది పార్టీ అభ్యర్థులకు లభించిన ఓట్లు కంటే నోటా ఓట్లే ఎక్కువ.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం, జూన్ 6 : పద్మనాభం 33/11 కెవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రేవిడి, పద్మనాభం ఫీడర్ల నిర్వహణ దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని జోన్-3 ఆపరేషన్ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.